అనుదినం... జనస్వరం

నవతెలంగాణ


సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం 17-2-2023

సంపుటి : 8 | సంచిక : 363 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

గవర్నర్ రాజకీయ రంగ ప్రవేశం చేయకూడదు

- సీజేఐ డివై చంద్రచూడ్



న్యూఢిల్లీ : గవర్నర్ రాజకీయ రంగ ప్రవేశం చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతేడాది మహారాష్ట్రలో శివసేన కూటమి ఉద్ధవ్‌ఠాక్రే ప్రభుత్వాన్ని కూలదోసి... ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ రాజకీయ సంక్షోభానికి సంబంధించిన కేసును సుప్రీంకోర్టు విచారించింది. ఈ కేసులో ఉద్ధవ్ ప్రభుత్వ పతనానికి కారణమైన కేసును కోర్టు విచారిస్తున్నది. మహారాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోషియారీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో వాదనలు వినిపించారు. 'మనకు రెండు పార్టీల వ్యవస్థ లేదు. భారతదేశం బహుళ పార్టీల

...11లో

త్రిపురలో భారీ పోలింగ్

సాయంత్రం 4 గంటలకు 81.11 శాతం ఓటింగ్

- బీజేపీ హింసాకాండ
- సీపీఐ(ఎం) కార్యకర్తలకు తీవ్ర గాయాలు



న్యూఢిల్లీ : బీజేపీ హింసాకాండ, బెదిరింపుల నడుమ త్రిపురలో భారీ పోలింగ్ జరిగింది. పోలింగ్‌కు నిర్ణీత సమయమైన సాయంత్రం 4 గంటలకు 81.11 శాతం మంది ఓటు వేసినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. ఆ సమయంలో దాదాపు 1,500 బూత్‌ల్లో 1.35 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. దీంతో పోలింగ్ శాతం 85కి చేరుతుందని అంచనా. రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 89.08 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభం కాగానే బూత్‌ల ముందు మహిళలతో పాటు పెద్ద ఎత్తున ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం 4 గంటల వరకూ ఈ ప్రక్రియ సాగింది. సాయంత్రం 4 గంటలు దాటిన తర్వాత కూడా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా వారికి టోకెన్లను

...11లో

ఓటు వేసిన మాణిక్ సర్కార్



మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ రామ్‌నగర్ నియోజకవర్గంలోని శిశువిహార్ హయ్యర్ సెకండరీ స్కూల్ బూత్‌లో ఓటు వేశారు. బీజేపీని ఓడించేందుకు ప్రజలు శాయశక్తులా ప్రయత్నించారని ఆయన మీడియాతో అన్నారు. కానీ, బీజేపీ అక్రమాలకు పాల్పడుతోందని, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, నిర్భయంగా ఓట్లు

...11లో



మతోన్మాదం పేరుతో దోపిడీ

హిందూత్వ, కార్పొరేట్లకు వ్యతిరేకంగా ద్విముఖ పోరు : ప్రకాష్‌కరత్

జ్యోతిబసు నగర్ నుంచి
నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కార్పొరేట్లు, మతోన్మాదులు కలిసికట్టుగా ప్రజలను దోపిడీ చేస్తున్నారనీ, దీనికోసం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ఘర్షణలు సృష్టిస్తున్నారనీ, దీన్ని ఎదుర్కోవాలంటే ద్విముఖ వ్యూహంతో పనిచేయాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్‌కరత్ పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలో భాగంగా రెండోరోజు మతోన్మాదం, కార్పొరేట్ల అనుబంధం, వామపక్షాల కార్యాచరణ, రాజ్యాంగంపై దాడి, ఆహార, ఉపాధి భద్రత, భూ పంపిణీ వంటి అంశాలపై సదస్సు జరిగింది. 2014లో మోడీ గద్దెనెక్కిన నాటి నుంచి కార్పొరేట్లు, మతోన్మాద శక్తుల కలయిక బలోపేతమైందని అన్నారు. ఈ తొమ్మిదేండ్లలో సరళీకరణ విధానాలు మరింత ఊపందుకున్నాయని తెలిపారు. క్రోనీ క్యాపిటలిజానికి అనుకూలంగా ప్రధాని పనిచేస్తున్నారని తెలిపారు. 1991లో పివి నరసింహారావు సరళీకరణ విధానాలను బడ్జెట్‌లో ప్రతిపాదించిన సందర్భంలో... తాము సూచించిన విధానాలనే కాంగ్రెస్ అమలు చేస్తున్నదని అద్వానీ పార్లమెంటులో చెప్పారని గుర్తుచేశారు. నెహ్రూ ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికలు ప్రభుత్వ రంగాన్ని బలపరుస్తుంటే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయని అన్నారు. మోడీ అన్ని రంగాలను ప్రయివేటీకరిస్తున్నారనీ, బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని ప్రభుత్వ సంపద పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారని అన్నారు. హిందూత్వ సిద్ధాంతం మతతత్వం పేరుతో సామాజికంగానూ విభజన తీసుకొస్తున్నారనీ, సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా అదానీ, అంబానీ, టాటాలు మోడీ పాలనలో సంతృప్తికరంగానే ఉన్నారని చెప్పారు. రతన్‌టాటా కూడా మోహన్‌భగవత్‌తో కలిసి 2015లో హెగ్డేవార్ సమాధి వద్దకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారని తెలిపారు. మోడీ నియంతృత్వం దిశగా ఏకపార్టీ పాలన సాగిస్తున్నారని అన్నారు. హిందూ రాష్ట్ర నినాదం అంటే మైనార్టీలపైనా దళితులపైనా దాడులేనన్నారు. కార్మికవర్గం రైతాంగం, వ్యవసాయ కార్మికుల హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని వివరించారు. కార్పొరేట్ల కోసం దేశ రాజ్యాంగాన్నే మార్చాలని బీజేపీ చెబుతున్నదని అన్నారు. హిందూత్వం ఒక్కటే ప్రజలను ఉత్సాహపరుస్తుందని మోడీ చెబుతున్నారని అన్నారు. ఉత్తర భారతంలో హిందూత్వ నినాదం పేరుతో ప్రజల జీవితాలపై దాడి చేస్తున్నారని అన్నారు. దళిత గిరిజనులపై దాడులు చేస్తూ వారిని అణచివేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా కూడా పోరాటం చేయడం ద్వారానే బీజేపీని ఓడించలగమని పేర్కొన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకరంగా రాజకీయ ప్రత్యామ్నాయం కోసం పోరాడాలని తెలిపారు. ప్రజల మౌలిక అవసరాల కోసం

...2లో

భగత్‌సింగ్ జీవితాన్ని చదవండి

యువతకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని పిలుపు

- రెడ్ బుక్స్ డే సందర్భంగా నెల రోజులపాటు అధ్యయనం
- 'భారత విప్లవ కెరటం భగత్‌సింగ్' పుస్తకావిష్కరణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెడ్ బుక్స్ డే సందర్భంగా రాష్ట్రంలో ఈనెల 21 నుంచి మార్చి 23 (భగత్‌సింగ్ వర్ధంతి) వరకూ అధ్యయన మాసోత్సవాన్ని నిర్వహించనున్నట్టు సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈ నెల రోజులపాటు భగత్‌సింగ్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో 'భారత విప్లవ కెరటం భగత్‌సింగ్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, చుక్క రాములు, టి.సాగర్, నవతెలంగాణ సంపాదకులు ఆర్.సుధాభాస్కర్, సీజీఎం పి. ప్రభాకర్, బుక్‌హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి, మేనేజర్ కృష్ణారెడ్డి, ఎడిటోరియల్ బోర్డు సభ్యులు ఎ.మోహన్‌కృష్ణ, నియోకర్సర్ ఇన్‌చార్జి జగదీశ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ...భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన భగత్‌సింగ్ జైలులో రాసిన వీలునామా, ఆయన సమకాలీకుడు శివవర్మ రాసిన పుస్తకాలను కలిపి ముద్రించిన పుస్తకంలోని

...11లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

వాయు కాలుష్య నివారణకు రూ. 696 కోట్ల ప్రాజెక్టు

సింగరేణి థర్మల్ విద్యుత్కేంద్రంలో తొలి ఎఫ్జీడీ ఏర్పాటు

- గడువులోపే పనులు పూర్తిచేయాలి : ఎమ్‌డీ ఎన్. శ్రీధర్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సంపూర్ణ కాలుష్య రహిత కేంద్రంగా తీర్చిదిద్దడానికి వీలుగా రూ.696 కోట్ల వ్యయంతో ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్జీడీ) అనుబంధ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్టు సింగరేణి సంస్థ చైర్మెన్, ఎమ్‌డీ ఎన్.శ్రీధర్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణ రావు, థర్మల్ ప్లాంట్ అధికారులు, నిర్మాణ ఏజెన్సీలతో ఎమ్‌డీ సుదీర్ఘంగా సమీక్షించారు. పనులు గడువు కన్నా ముందే పూర్తిచేయాలని నిర్మాణ సంస్థ అయిన పీఈఎస్ ఇంజినీర్స్ ప్రయివేటు లిమిటెడ్స్‌ను ఆదేశించారు. యూనిట్ ఒకటికి సంబంధించిన ఎఫ్జీడీని 2024 జూన్ కల్లా, రెండో యూనిట్‌ను అదే ఏడాది సెప్టెంబర్ లోపు పూర్తి చేయాలని ఆయన కాలపరిమితిని నిర్దేశించారు. ఈ సమీక్ష జీఎం (కోఆర్డినేషన్) ఎం. సురేష్, చీఫ్ టెక్నికల్ కన్సల్టెంట్ సంజయ్ కుమార్ సూర్, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం జనరల్ మేనేజర్ డి.ఎస్. సూర్యనారాయణ రాజు, చీఫ్ ఆఫ్ పవర్ ఎన్.వి.కె. విశ్వనాథరాజు, సివిల్ ఏజీఎం ప్రసాద్, ఎఫ్జీడీ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి శ్రీనివాసులు, కన్సల్టెంట్ (ఎన్.టి.పి.సి) సోహైల్ ఖాన్, నిర్మాణ ఏజెన్సీ (పి.ఈ.ఎస్) ఎమ్‌డీ వాసుదేవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎఫ్జీడీతో వాయు శుద్ధి ప్రక్రియ ఇలా...

ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్‌గా పిలవబడే ఈ ప్రాజెక్టులో భాగంగా బొగ్గును మండించగా వచ్చే వాయువులో దాగి ఉన్న సల్ఫర్ అనుబంధ వాయువులను వేరుచేస్తారు. దానికోసం 150 మీటర్ల ఎత్తయిన ఒక చిమ్నీని ఏర్పాటు చేస్తారు. ఈ చిమ్నీలో కింది నుంచి పైకి వెళ్లే వాయువుపై కాల్షియం కార్బోనేట్ (తడి సున్నం)ను పైనుంచి బలంగా పంపిస్తారు. తద్వారా బొగ్గు మండించిన వాయువుల్లో ఉన్న సల్ఫర్ డయాక్సైడ్‌తో పలుదశల్లో తడి సున్నంతో రసాయనిక చర్య జరుగుతుంది ఈ ప్రక్రియలో వాయువులో ఉన్న సల్ఫర్ అనుబంధ వాయువులన్నింటినీ తడి సున్నం పీల్చుకుంటుంది.

తత్ఫలితంగా బయటకు విడుదల చేస్తున్న వాయువులలో సల్ఫర్ అనుబంధ వాయువుల శాతం ఘనపు మీటరుకు 200 మిల్లీ గ్రాములలోపే ఉంటుంది. ఈ రసాయనిక ప్రక్రియలో అంతిమంగా కాల్షియం సల్ఫేట్ అనే ఘన పదార్థం ఏర్పడుతుంది. దీనినే జిప్సం అంటారు. ఈ ప్రక్రియలో వెలువడే జిప్సాన్ని ఎరువులు, సిమెంటు, పేపర్, వస్త్ర పరిశ్రమ, నిర్మాణరంగంలో వినియోగిస్తున్నారు.

మే నెలాఖరు వరకూ కంటి వెలుగు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

కంటి వెలుగు కార్యక్రమాన్ని మే నెలాఖరు వరకూ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులను ఆదేశించారు .ప్రిస్క్రిప్షన్ ఆధారంగా ఇచ్చే కంటి అద్దాల పంపిణీలో జాగ్రత్త వహించాలని సూచించారు. కంటి వెలుగు, ఇంటి స్థలాల ఎంపిక, పోడు భూముల కేటాయింపు, హరిత హారం తదితర అంశాలపై గురువారం జిల్లా కలెక్టర్లతో బీఆర్‌కేఆర్ భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు తీవ్ర మవుతున్న నందున నేపథ్యంలో కంటి వెలుగు శిబిరాల వద్ద మంచినీటి సరఫరా, టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో నిరుపేదలకు భూమి పట్టాలను ప్రధానం చేయడానికి వీలుగా అర్బన్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, నివాసం ఉంటున్న వారి వివరాలను శాసన సభ నియోజక వర్గాల వారీగా సేకరించి వెంటనే ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. పోడు భూములకు సంబంధించి యాజమాన్య పట్టాలను అందించేం దుకు జిల్లా స్థాయి కమిటీ లో ఆమోదం పొందిన వాటికి పాస్ పుస్తకాలను రూపొందించాల న్నారు. హరిత హారం కార్యక్రమంలో భాగంగా 2023–24లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లను ఆదేశిం చారు. ప్రభుత్వ ఉత్తర్వులు 58, 59, 76, 118 జీవోల ప్రకారం లబ్దిదారుల ఎంపిక పూర్తయిన వారందరికీ రిజిస్ట్రేషన్లు వెంటనే చేపట్టాలని తెలి పారు. ఆయా జిల్లాలో పూర్తయిన సమీకృత జిల్లా కలెక్టరేట్లను నూతన కార్యాలయాల్లోకి తరలించే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, పంచాయితీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, గిరిజన సంక్షే మ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీని వాస రాజు, వైద్య ఆరోగ్య శాఖ కార్య దర్శి రిజ్వీ, పీసీసీఎఫ్ డోబ్రియల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మతోన్మాదం పేరుతో దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

పోరాడుతూనే వారి హిందూత్వ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. మోడీ మాట్లాడితే దేశ ఆర్థిక వ్యవస్థ ఐదో, మూడో స్థానంలో ఉందని ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. హిందూత్వం అంటే సామాజిక దోపిడీ అమలు చేయడమేనని వివరించారు. ఆహార భద్రత అంశంపై ప్రొఫెసర్ మధుర స్వామినాథన్ మాట్లాడుతూ దేశంలో ఆహార భద్రత అవసరాన్ని వివరించారు. ఆహార భద్రత అంటే భౌతికంగా అవసరాలు తీరడమే కాదని, ఆర్థికంగా అలసరాలు తీరాలని అన్నారు. సరైన ఆహారం, పౌష్టికాహారం ప్రజలకు అందాలన్నారు. నీరు, శానిటేషన్ మెరుగ్గా కల్పించాలన్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండి 240 కోట్ల టన్నుల దిగుబడి వచ్చిందని, అయినా పౌష్టికాహారాన్ని అందించలేకపోతున్నామని తెలిపారు. ఆహార భద్రత విషయంలో 150 దేశాల్లో మనదేశం 137 స్థానంలో ఉందని, నేపాల్, బంగ్లాదేశ్‌కన్నా తక్కువస్థాయిలో ఉన్నామని చెప్పారు. గ్రామీణ ఉపాధి రోజురోజుకూ తగ్గుతున్న విషయాన్ని గుర్తుచేశారు. వ్యవసాయేతర రంగాల్లోనూ ఉపాధి క్షీణించిందని, మహిళలు వలస బాట పడుతున్నారని అన్నారు. వేతనాల్లోనూ పురుషులకు మహిళలకు మధ్య వ్యత్యాసం చాలా తీవ్రంగా ఉందని అన్నారు. వేతనాల్లోనూ వ్యత్యాసం ఉందని 360 రూపాయలు పురుషులకు ఉంటే 269 రూపాయలు మహిళలకు ఇస్తున్నారని తెలిపారు. యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వేతనాలు చాలా తక్కువ అన్నారు. జమ్మూకాశ్మీర్, పంజాబ్, తమిళనాడు, హర్యానాలో వేతనాలు ఫర్వాలేదని వివరించారు. 2011–12 లెక్కల ప్రకారం ఆహార సంక్షోభం తీవ్రమైందని అన్నారు. ప్రజాపంపిణీలో కనీసావసర వస్తువులు కూడా సరఫరా చేయాలన్నారు. భూ పంపిణీపై ప్రొఫెసర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో 1.20 కోట్ల ఎకరాల సాగుకు ఉపయోగపడే మిగులు భూమి ఉందనీ, దాన్ని పంచడంలో ఇప్పటి వరకూ ఎవరూ ఆసక్తి చూపలేదని తెలిపారు. పైగా పరిశ్రమలకు కేటాయించేసి గ్రామీణ ప్రాంత ప్రజలను తీవ్ర ఇబ్బందులు పాల్జేస్తున్నారని చెప్పారు. భూదాన్ భూములను చెప్పినా అవి ఎక్కడ ఉన్నాయో ఎవరి చేతుల్లో ఉన్నాయో ఇప్పటికీ లెక్క తెలియదని వివరించారు. భూ సంస్కరణల అమల్లోనూ తీవ్రలోపం జరిగిందని అన్నారు. ఏపీ తెలంగాణాలో 54శాతం భూమిలేని పేదలు ఉన్నారని వివరించారు. రాజ్యాంగంపై దాడి అనే అంశంపై వికాస్ రంజన్ భట్టాచార్య మాట్లాడుతూ దోపిడీకి, మతోన్మాదానికి వీలుగా రాజ్యాంగాన్ని మార్చేస్తున్నారని తెలిపారు. ప్రశ్నించిన వారిని చంపడమో, అరెస్టులు చేయడం ద్వారా వారి పంతాన్ని నెగ్గించుకునేదిశగా పాలన చేస్తున్నారని విమర్శించారు. విజయరాఘవన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి వెంకట్ పాల్గొన్నారు.



హక్కులకోసం పోరాటం

వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

హౌరా నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నామని, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని, భూమిలేని పేదలకు న్యాయం చేయాలని, అర్హులైన పేదలందరికీ న్యాయం చేయాలని చేస్తున్న పోరాటాల ఫలితంగా పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాల్లో కదలిక వస్తున్నాయని తెలిపారు. హౌరాలోని జ్యోతిబసు నగర్లో జరుగుతున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల్లో రెండోరోజైన గురువారం పలు రాష్ట్రాల నుండి హాజరైన ప్రతినిధులు కార్యదర్శి నివేదికపై మాట్లాడారు.

పోరాటాలతో ప్రభుత్వంలో కదలిక

పేదల భూములు లాక్కుంటున్న ప్రభుత్వం
ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి నాగరాజు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, అక్కడ అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ బిజెపికి అనుకూలంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ నుండి మాట్లాడిన నాగరాజు తెలిపారు. . సంఘం ఆధ్వర్యాన 11 రకాల అంశాలపై తాము పోరాటం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పరిశ్రమల కోసం భూములు లాక్కుంటారని, దీనివల్ల ఎక్కువమంది పేదలు భూమి కోల్పోతున్నారని తెలిపారు. దీనిపై తాము పోరాటం నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే దళితులకు పంచిన అసైన్డ్ భూములను ప్రభుత్వం లాక్కుంటుందని వివరించారు. దీనిపై పోరాటంలో అనేకమంది జైళ్లపాలు చేశారని వివరించారు. ఆందోళనకారులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారని వివరించారు. భూ పోరాటాలు జరిగే ప్రాంతంలో నాయకులు, పోరాటాల్లో పాల్గొంటున్న వారిని పోలీసులు ముందుగా నిర్బంధిస్తున్నారని తెలిపారు. కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లోనూ భూములను కార్పొరేట్లకు కట్టబెతున్నారని, దీనిపైనా పోరాటాలు సాగిస్తున్నామని చెప్పారు.

కేంద్ర ఒత్తిడులు ఎదుర్కొంటున్నాం
రతీంద్రన్ కేరళ ప్రతినిధి

కేరళలో వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని కేరళ ప్రతినిధి రతీంద్రన్ తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసినట్లు చెప్పారు. దీన్ని తట్టుకోలేని కేంద్రం తనిఖీల పేరుతో వేధింపులకు దిగుతోందని చెప్పారు. ఎన్ఐఎ, ఇడిని అడ్డం పెట్టుకుని దాడులకు దిగుతోందన్నారు.

పట్టణాల్లో ఉపాధి కోసం పోరు
కోదండన్, తమిళనాడు ప్రతినిధి

పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ... తమిళ నాడులో పోరా టాలు నిర్వహిస్తున్నట్టు ఆ రాష్ట్ర ప్రతినిధి కోదండన్ తెలిపారు. దీనిపై 2021లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టామని వివరించారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

పోరాటాల ద్వారా విస్తరణ
బుర్రి ప్రసాదు, తెలంగాణ ప్రతినిధి



కోవిడ్ సమయంలో వ్యవసాయ కార్మిక సంఘం సేవా కార్యక్రమాలు అమలు చేసిందని తెలంగాణ తెలిపారు. అలా చేసిన పోరాటాల వల్ల కొత్త ప్రాంతాల్లోకి విస్తరించామని తెలిపారు. అనేక సామాజిక పరమైన అంశాల్లో ప్రజలను చైతన్యం చేస్తున్నామని తెలిపారు. మహిళా వ్యవసాయ కార్మిక సంఘం కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు. మహిళా కార్మికులు ఉద్యమంలోకి ఎక్కువగా వస్తున్నారని వివరించారు. వారిని మరింత చైతన్యం చేసేం దుకు అనేక సమావేశాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే భూపోరాటాల్లోకి పెద్దఎత్తున పేదలు కదలివస్తున్నారని తెలిపారు. తెలంగాణాలో పెట్టిన ధరణి వెబ్‌సైట్ వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, వాటిపైనా పోరాడుతున్నామని చెప్పారు.

రేపాకుల శ్రీనివాస్, తెలంగాణ



తెలంగాణా ప్రాంతంలో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలంగాణ నుండి చర్చల్లో పాల్గొన్న రేపాకుల శ్రీనివాస్ చెప్పారు. మూడో మహాసభ ఖమ్మంలో లక్షమందితో నిర్వహించా మన్నారు. భూమి, ఇళ్లస్థలాలు, పోడుభూమి, భూములు కోల్పోతున్నవారు, ఉపాధి హామీ పథకంపై పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించా మన్నారు. ఫలితంగా ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. అంతేకాకుండా ఉపాధి హామీ విషయంలో పేదలకు న్యాయం చేయాలని డిమాండు చేస్తున్నట్లు తెలిపారు . ప్రభుత్వం అనేక ప్రాంతాల్లో పేదల భూములను పరిశ్రమల పేరుతో ప్రభుత్వం లాక్కుంటోందన్నారు. దీనిపైనా ఆందోళన చేపట్టామన్నారు. అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల ముందు పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు.

మత విద్వేషాలను తిప్పికొట్టండి
మహాసభలో తీర్మానం

- ప్రవేశపెట్టిన తుషార్‌ఘోష్, బలపరిచిన పళనిస్వామి

జ్యోతిబసు నగర్ నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న మత విద్వేషాలను తిప్పికొట్టాలని వ్యవసాయ కార్మికసంఘం జాతీయ మహాసభ పిలుపునిచ్చింది. ఈ మేరకు ప్రతిపాదించిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ తీర్మానాన్ని సంఘం జాతీయ సహాయ కార్యదర్శి తుషార్‌ఘోష్ ప్రతిపాదించగా తమిళనాడు ప్రతినిధి పళనిస్వామి బలపరిచారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఎక్కడికక్కడ ఐక్యం కావాలని తీర్మానంలో పేర్కొన్నారు బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత లౌకికతత్వంపై దాడి పెరగడం ఆందోళనమని, మోడీ వచ్చిన తరువాత ఇది మరింత పెరిగిందని తెలిపారు. అధికారిక సంస్థలను ఉపయోగించడం ద్వారా దీన్ని ముందుకు తెచ్చారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా లౌకికతత్వం ప్రమాదంలోకి వెళ్లిందని తీర్మానంలో పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో గ్రామాలు అతలాకుతలం

పోరాటాలు..సేవా ధృక్పథంతో
సంఘ విస్తరణ : కార్యదర్శి నివేదికలో వెంకట్

- కొనసాగుతున్న వ్యవసాయ కార్మికసంఘం మహాసభ



జ్యోతిబసు నగర్ నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల కారణంగా గ్రామీణ భారతం అతలాకుతలమవుతోందనిఅఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్ తెలిపారు. హౌరాలోని జ్యోతిబసునగర్(శరత్‌శ్చంద్ర ఆడిటోరియం)లో జరుగుతున్న 10వ మహాసభలో ఆయన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కేంద్ర విధానాల కారణంగా వ్యవసాయ రంగం గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షోభంలో చిక్కుకుందని, దాని ఫలితం వ్యవసాయ కార్మికులపై తీవ్రస్థాయిలో పడుతోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోల్పోయి, పెద్ద సంఖ్యలో వ్యవసాయ కార్మికులు పట్టణాల బాట పట్టాల్సివచ్చిందని చెప్పారు. కరోనా కాలంలో పట్టణాల్లో సైతం పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. అదే సమయంలో బిలియనీర్లు పెరిగారని, దీనికి ప్రభుత్వ విధానాలే కారణమని చెప్పారు. మరోవైపు ఫాసిస్టు దాడులూ పెరుగుతున్నాయని, దీనికి బలవుతోందని కూడా నిరుపేదలు, వ్యవసాయ కార్మికులేనని అన్నారు. భూమిలేని పేదల సంఖ్య క్రమంగా పెరుగుతోందని అన్నారు. వ్యవసాయ కార్మికులతోపాటు చిరు ఉద్యోగులూ ఉపాధిని కోల్పోయారని వివరించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేయడంతోపాటు, సేవా ధృక్పథంతో వ్యవసాయ కార్మికసంఘం వ్యవహరిస్తోందని, ఫలితంగా సంఘ సభ్యత్వం గణనీయంగా పెరుగుతోందని అన్నారు. 2020లో కన్నూరులో జరిగిన మహాసభ అనంతరం దేశ వ్యాప్తంగా ఉద్యమం ఊపందుకుందని తెలిపారు. కేరళలో 22 లక్షలు, బెంగాల్లో 19 లక్షల సభ్యత్వం ఉందని వివరించారు. అలాగే తమిళనాడు, తెలంగాణా, తమిళనాడు, త్రిపుర, బీహార్, అస్సాం ఇలా అన్ని రాష్ట్రాల్లోనూ క్రమంగా సభ్యతాన్ని పెంచుకుంటున్నామని వివరించారు. బెంగాల్ వంటి రాష్ట్రంలో ఒక్కరోజులోనే ఐదు లక్షల సభ్యత్వం చేర్పించారని, ఉద్యమం ప్రభావం, ఫలితం ఉండటంతోనే అనేకమంది సంఘంలో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని అన్నారు. కేరళ రాష్ట్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ పేదలకు గృహ నిర్మాణంలో సంఘం కీలకపాత్ర పోషించిందన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా వంటి రాష్ట్రాల్లో వందల సంఖ్యలో పేదలు నివశించే ప్రాంతాల్లో పర్యటించి వారి ఇబ్బందులు తెలుసుకోవడంతోపాటు వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. తెలంగాణాలో వరంగల్ నగరంలో నిర్వహించిన ఉద్యమం మంచి స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ పేదల కాలనీల్లో పర్యటించి సర్వే చేశారని, దీని ఫలితంగా నిజమైన లబ్దిదారులు ఎవరో ప్రభుత్వానికి తెలిసొచ్చి న్యాయం జరుగుతోందని అన్నారు. కరోనా కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నాయకత్వం సేవా కార్యక్రమాలు చేయడంతోపాటు నిధులు సేకరించి కోవిడ్ బారినపడిన వారికోసం సేవలందించిందని తెలిపారు.బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవడంతోపాటు, కేంద్రానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించాల్సి ఉందని మహాసభ వేదికగా పిలుపునిచ్చారు.

తెలంగాణ

కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

- ఆలేరు, మోటకొండూరు మండలాల్లో జీపీ కార్మికుల పాదయాత్ర
- విజయవంతంగా వంద కిలోమీటర్లు పూర్తి



నవతెలంగాణ -ఆలేరు రూరల్

కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించి వేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పాదయాత్ర గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం మంతాపురి, దిలవారిపూర్ గ్రామాల్లో కొనసాగింది. దిలవారిపూర్ గ్రామంలో జరిగిన సభలో పంచాయతీ కార్మికులు పాదయాత్ర బృందానికి తమ బాధలను విన్నవించుకున్నారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం నిర్ణయించాలని సుదీర్ఘకాలం పోరాటం చేస్తే.. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనా లేకుండా జీవో నెంబర్ 51 విడుదల చేసి.. 500 జనాభాకు ఒక కార్మికుడు చొప్పున లెక్కించి వేతనాన్ని రూ.8500 నిర్ణయించిందన్నారు. అదనంగా ఉన్న కార్మికులకు ఎలాంటి వేతనాలూ చెల్లించడం లేదన్నారు. ఒక కార్మికునికి ఇచ్చే వేతనాన్ని అక్కడ పనిచేసే కార్మికులందరూ పంచుకుంటున్నామని, ఫలితంగా రూ.3500 నుంచి 4,500 మాత్రమే వేతనాలు పొందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నా కారోబార్ బిల్ కలెక్టర్‌కు కేవలం రూ.6000 ఇస్తున్నారని కార్మికులు తెలిపారు. కుటుంబం గవడం కష్టంగా ఉందని, పెరిగిన ఖర్చులకు తగినట్టు వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందుకోసం తామూ పాదయాత్రలో భాగస్వాములం అవుతామని కార్మికులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచి జీవో నెంబర్ 60 ప్రకారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు, ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తునికి మహేష్ వినోద్ కుమార్ బృందంగా పాదయాత్ర పాలకుర్తి నుంచి మొదలుకొని మొదలు పెట్టి హైదరాబాద్ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పాదయాత్ర ఈనెల 28న మధ్యాహ్నం 2 గంటలకు ఇందిరాపార్క్ వద్ద ముగుస్తుందని తెలిపారు. అనంతరం పాదయాత్ర మోటకొండూరు మండలంలో కొనసాగింది. పాదయాత్రకు సంఘీభావంగా కలుగీత కార్మిక సంఘం రైతు సంఘం, సీపీఐ(ఎం), సీపీఐ, వివిధ సంఘాలు, పార్టీలు మద్దతు తెలిపాయి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కల్లూరి మల్లేశం, కలుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి జగదీష్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దుపటి వెంకటేష్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఇక్బాల్, సీఐటీయూ మోటకొండూరు మండల అధ్యక్షులు కొల్లూరు ఆంజనేయులు, నాయకులు సంగీ రాజు, ఆడెపు స్వామి, చెక్క దశరథ, అంజయ్య పాల్గొన్నారు.

సక్సెస్‌గా వంద కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి

పంచాయతీ కార్మికుల కోసం తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ చేస్తున్న పాదయాత్ర 100 కిలోమీటర్లకు చేరుకున్నది. పాదయాత్ర ఈ నెల 12న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వం వహిస్తున్న పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ప్రారంభమైన విషయం తెలిసిందే. వరంగల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల మీదుగా యాద్రాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గానికి చేరుకున్నది. ఆ జిల్లాలోని మోటకొండూరు మండల కేంద్రంలో వంద కిలోమీటర్ల మైలురాయిని పాదయాత్ర చేరుకున్నది. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రతినెలా జీతాలివ్వాలనే డిమాండ్‌తో కొనసాగుతున్నది. వారికిస్తున్న రూ.8,500 జీతాన్ని ఇద్దరు, ముగ్గురు కార్మికులు పంచుకుంటున్న తీరును పాదయాత్ర బృందం ఎత్తిచూపుతున్నది.



మాణిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో ఎమ్మెల్సీగా గెలిపించాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి

నవతెలంగాణ-మంచాల

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి మాణిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి ఉపాధ్యాయులను కోరారు. గురువారం రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలు, కేజీబీవీ పాఠశాలల్లో మాణిక్‌రెడ్డి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగార్థులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ ఎంతో కృషి చేస్తోందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం తమ సంఘంతోనే సాధ్యమని చెప్పారు. ఉపాధ్యాయులకు నిరంతరం అందుబాటులో ఉండే మాణిక్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు సుగంధ, జిల్లా ఉపాధ్యక్షులు కల్పన, జిల్లా కార్యదర్శులు భువనేశ్వరి, రాములయ్య, కేజీబీవీ ఎస్ఓ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో 'లంపి స్కిన్' కలకలం

- వైరస్‌తో ఆవు దూడ మృతి

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

కామారెడ్డి జిల్లాలో లంపి స్కిన్ వైరస్ కలకలం రేపుతోంది. కామారెడ్డి మార్కెట్‌లో ఆవుకు లంపి స్కిన్ వైరస్ సోకడంతో రెండ్రోజుల కిందట మృత్యువాతపడింది. తాజాగా గురువారం మరో లేగ దూడ చనిపోయింది. లంపి స్కిన్ వైరస్ సోకిన వందలాది ఆవులు రోడ్లపైనే తిరుగుతుండటంతో స్థానికులు భయాందోళనకు లోనవుతున్నారు. లింపి స్కిన్ వైరస్ ఈగల కారణంగా పశువులకు వ్యాప్తి చెందుతున్నట్టు అధికారులు తెలిపారు. ఈ వైరస్ కారణంగా పశువుల చర్మంపై ఎర్రటి బొడిపెలు పుండ్లుగా మారి దేహమంతా వ్యాపిస్తాయని ఐవీఆర్ఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కేపీ సింగ్ తెలిపారు. దీంతో తీవ్ర జ్వరం వచ్చి.. పశువులు పాలు ఇవ్వడం, గడ్డి తినడం మానేస్తాయని తెలిపారు. లంపిస్కిన్ పశువుల నుంచి మానవులకు సంక్రమించినట్టు ఎటువంటి ఆధారాలూ లేవన్నారు.

ప్రయివేటు అధ్యాపకులకూ ఎగ్జామినర్లుగా అవకాశమివ్వాలి : టీపీటీఎల్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయివేటు కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులకూ ఎగ్జామినర్లుగా అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రయివేటు టీచర్లు, లెక్చరర్ల ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ ఎ విజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ అధ్యాపకులను మాత్రమే ఎగ్జామినర్లుగా నియమిస్తున్నారని గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వారొక్కరికే ఈ పని కల్పించడం వల్ల అది వారికి కూడా భారమవుతున్నదని పేర్కొన్నారు.

కోమట్టిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

- ఇటుకుల పహాడ్‌లో ఇరు పార్టీల కార్యకర్తల తోపులాట
- చెప్పులు, కర్రలు విసురుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ -నకిరేకల్

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఇటుకలపాడు గ్రామంలో గురువారం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తల మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగి ఎంపీ కోమటిరెడ్డి పర్యటన ఉద్రిక్తంగా మారింది. గురువారం శాలిగౌరారం మండలంలోని ఇటుకుల పహాడ్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రామంలో సీసీ రోడ్లు సక్రమంగా లేవని, రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని అనడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా మైకు కనెక్షన్లను ఊడదీసి తోపులాటకు దిగారు. ఆలయ ప్రాంగణంలోకి చెప్పులు విసిరేశారు.

పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలివ్వాలి

దరఖాస్తులను పున: పరిశీలించాలి

- 20న హైదరాబాద్‌లో ధర్నా: ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నేతలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలివ్వాలి. గిరిజనుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను తిరిగి పరిశీలించాల'ని ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో సమన్వయ కమిటీ కన్వీనర్లు వేముల పల్లి వెంట్రామయ్య, కెచ్చెల రంగయ్య, అంజయ్య నాయక్ విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే, అటవీ హక్కులను కాలరాసే 'అటవీ సంరక్షణ నియమాలు- 2022'ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.. ఆ నియమాలను ఉపసంహరించాలని కోరుతూ, రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నేతలు పాల్గొంటాయన్నారని తెలిపారు.. ఆదివాసులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములన్నింటికీ, ఈ నెల చివరినాటికి (11.5 లక్షల ఎకరాలకు) హక్కుపత్రాలు యిస్తామంటూ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటన చేయటాన్ని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. అయితే గతంలో కూడా అనేకసార్లు ఈ విధంగా వాగ్దానాలు చేసి అమలు చేయలేదని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ప్రచారానికే పరిమితం కాకుండా హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అడవి బిడ్డలను ఆక్రమణదారులుగా పేర్కొనడం తగదని తెలిపారు. పోడు భూమిపై ఆదివాసులకు హక్కులేదని మాట్లాడటం సరికాదన్నారు. అటవీ హక్కుల చట్టం, 2006 ద్వారా 13.12.2005 వరకు పోడు భూములపై ఆదివాసులకు చట్టబద్ధ హక్కు లభించిందని గుర్తుచేశారు. గిరిజనుల హక్కుల్ని గుర్తించి, వారికి పట్టాలివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అయితే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. చాలా చోట్ల ఆదివాసుల అర్జీలను తిరస్కరించారని తెలిపారు. కొన్ని చోట్ల సర్వేలు కూడా చేయలేదన్నారు. మరి కొన్ని చోట్ల అటవీ హక్కుల చట్టంలో లేని విధంగా, మంజూరు చేసిన అర్జీదారులకు సంబంధించిన (2005కు ముందు) ఆధార్ కార్డు చూపాలంటూ విషను షరతులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టంలో లేని సాక్ష్యాధారం - ఉపగ్రహఛాయా చిత్రాల పేరిట అనేక దరఖాస్తులు తిరస్కరించారని తెలిపారు. చట్టానికి విరుద్ధంగా మైనర్లనీ, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఉందనే పేరుతో అర్జీలను తిరస్కరించారనీ, గిరిజనేతరుల దరఖాస్తులన్నింటినీ చట్ట వ్యతిరేకంగా తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకర్ల సమావేశంలో సమన్వయ కమిటీ నాయకులు మండల వెంకన్న, ప్రసాదన్న, మామిడాల భిక్షపతి, వి ప్రభాకర్, జక్కుల వెంకటయ్య కూడా మాట్లాడారు.

సంపాదకీయం

జనం మీద కుహనా ప్రచార దాడి!

2020 ఆగస్టులో అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన వార్త ఒక రాజకీయ తుపాన్ రేపింది. ఫేస్‌బుక్‌లో విద్వేష ప్రచారం చేసే బీజేపీ నేతల పోస్టులను తొలగించకుండా సదరు సంస్థ పబ్లిక్ పాలసీ డైరెక్టర్‌గా ఉన్న అంఖీదాస్ చూశారన్నది దాని సారం కాగా, ఆమె బీజేపీకి ఎంత వీర విధేయురాలో సాక్ష్యాలతో సహా వెల్లడించింది. "మనం అతని (నరేంద్రమోడీ) సామాజిక మాధ్యమ మంట రగిల్చాం తరువాత చరిత్ర మీకు తెలిసిందే. ఎట్టకేలకు భారత ప్రభుత్వ సోషలిజాన్ని వదిలించుకొనేందుకు గాను దిగువ స్థాయి నుంచి చేసిన పనికి ముప్పై ఏండ్లు

జర్నలిస్టులను బెదిరించటమే కాదు, వారికి ప్రాణహాని కూడా ప్రపంచమంతటా ఉన్నదని చెబుతున్న నివేదికలు మన దేశంలోని ప్రజాస్వామ్యవాదులకు ఒక హెచ్చరిక కావాలి. తన ఎన్నిక కేసులో ఓడిన ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించి పత్రికల మీద సెన్సారు పేరుతో వ్యతిరేక వార్తలను నిషేధించిన దానికి, బిబిసి డాక్యుమెంటరీని సామాజిక మాధ్యమాల్లో నిషేధించిన నరేంద్రమోడీ సర్కార్ నిర్వాకానికి పెద్ద తేడా లేదు. ఇది ఒక ట్రైలర్ మాత్రమే, సినిమా ఎలా ఉంటుందో ఊహించుకోవాల్సిందే!

పట్టింది" అంటూ ఆమె 2014లో గెలిచిన సందర్భంగా మోడీని పొగడటం, కాంగ్రెస్ ఓడిపోవటం గురించి రాసిన రాతలను ఆ పత్రిక వెల్లడించింది. భారత జార్జి బుష్‌గా నరేంద్రమోడీని ఆమె వర్ణించారు. 2012 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ సామాజిక మాధ్యమ విభాగానికి ఆమె ఇచ్చిన శిక్షణ గురించి కూడా పేర్కొన్నది. ఇదంతా ఎందుకు గుర్తు చేయాల్సి వచ్చిందంటే ఇజ్రాయెల్‌కు చెందిన "టీమ్ జార్జి" పేరుతో టాల్ హనాన్ బృందం 33 దేశాలలో ఎన్నికల సందర్భంగా నిర్వహించిన తప్పుడు ప్రచారం గురించి ఒక అంతర్జాతీయ జర్నలిస్టుల బృందం పరిశోధించి వెలుగులోకి తెచ్చిన అంశాలను బ్రిటన్‌కు చెందిన గార్డియన్ పత్రిక తాజాగా వెల్లడించింది. అంతే కాదు న్యూయార్క్ నగరం కేంద్రంగా ఐరాస-యునెస్కో నిధులతో పని చేస్తున్న జర్నలిస్టుల అంతర్జాతీయ కేంద్రం (ఐసిఎఫ్‌జె) నివేదిక కూడా వెల్లడైంది. దానిలో భారత్‌కు చెందిన మహిళా జర్నలిస్టులు రానా అయూబ్‌ను వేధించుతున్న, గౌరీ లంకేష్ ప్రాణాలను బలిగొన్న బీజేపీ అనుబంధ బృందాల గురించి వెల్లడించారు.



ఈ రెండు నివేదికల్లోని అంశాలు ప్రజాస్వామ్య వాదులకు, నిబద్ధత కలిగిన జర్నలిజం వృత్తిగా ఉన్నవారికి ఆందోళన కలిగిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో తిష్టవేసిన కాషాయదళాలు ఎలాంటి పాత్ర నిర్వహిస్తున్నాయో వాల్‌స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. పత్రికలు, టీవీలు మినహాయింపు కాదు. విద్వేష ప్రచారాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విటర్లలో ప్రచారం చేయటం ఒకటైతే పత్రికల్లో రాతలు, టీవీల్లో చర్చల పేరుతో రెచ్చగొట్టే అంశాలను ముందుకు తేవటం మరొకటి. టీమ్ జార్జి వంటి సంఘటిత బృందాలు మన దేశంలో కోకొల్లలుగా ఉన్నాయి. ఊరూపేరులేని వాటి ఉత్పత్తులు నిరంతరం వాట్సాప్‌ల్లో మనం కోరకుండానే వచ్చిపడుతుంటాయి. ఇవి రక్తం చిందకుండానే ప్రాణాలు తీసే ఆయుధాలంటే అతిశయోక్తి కాదు. ఊరూపేరు లేకుండా, లేదా అపహరించిన ఫొటోలతో వారికి తెలియకుండానే ఖాతాలు తెరిచి తమ అజెండా ప్రకారం ప్రచారం చేసే ముఠాలే ఇవి. అలాంటి పని చేస్తున్న టీమ్ జార్జి ముఠా అది తప్పేమీ కాదని చెప్పటమే కాదు, అందుకు గాను ఎంత మొత్తాలను వసూలు చేస్తున్నదీ వెల్లడించారు. ఒక ఆఫ్రికా దేశ నేత ప్రతినిధులమని, ప్రచారం చేసేందుకు సేవలు కావాలంటూ వెళ్లిన జర్నలిస్టులకు వారు చెప్పిన సమాచారం, తమ పనిని ప్రదర్శించిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తున్నది. ఎన్ని దేశాల్లో ఇలాంటి కుహనా ప్రచారకులు ఎందరు ఉన్నదీ ఊహించుకోవాల్సిందే తప్ప లెక్కించలేం.

ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చుకొనేందుకు, ప్రత్యర్థులను బదనామ్‌చేసి దెబ్బతీసేందుకు గూఢచార సంస్థలు, రాజకీయపార్టీలు, వాణిజ్య సంస్థలు కూడా ఇలాంటి ప్రచార ఆయుధాలతో దాడులు చేసే కిరాయిమూకలను రంగంలోకి దించుతున్నాయి. చివరికి ఇవి భార్యాభర్తల ఫోన్లు, సామాజిక మాధ్యమ ఖాతాలలో ప్రవేశించి అనుమానాలు, విబేధాలను రగిలిస్తున్నాయి. అడ్వాన్స్‌డ్ ఇంపాక్ట్ మీడియా సొల్యూషన్స్ (ఎయిమ్స్) అనే సాఫ్ట్‌వేర్ 30వేల నకిలీ ఖాతాలను నిర్వహిస్తుందంటే తప్పుడు ప్రచారానికి ఉన్న బలం ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

స్టోరీ కిల్లర్స్ ప్రాజెక్టు పేరుతో మహిళా జర్నలిస్టుల మీద రూపొందించిన వివరాలను ఐసిఎఫ్‌జె వెల్లడించింది. ఈ సంస్థ షెఫీల్డ్ విశ్వవిద్యాలయ కంప్యూటర్ నిపుణుల సహకారంతో భారత జర్నలిస్టులు రానా అయూబ్, గౌరీ లంకేష్, అల్ జజీరా యాంకర్ ఘదా క్వియిస్ తదితరుల గురించి నివేదికలను రూపొందించారు. వీరు కూడా "విస్మృత కథలు" సంస్థతో సమన్వయం చేసుకున్నారు. స్త్రీ ద్వేషం, బూతులు, ఆమె మతం, రాసిన రాతల మీద ద్వేషం వెళ్లగక్కుతూ రానా అయూబ్ మీద ప్రతి పద్నాలుగు సెకండ్లకు ఒక ట్వీట్ చేసినట్లు తేలింది. ఒక ట్వీట్ రాగానే ఒకటి రెండు నిమిషాల్లో దాని మీద వందల వేల ప్రతికూల స్పందనలు వెలువడటం అంటే అవి కంప్యూటర్లకు పుట్టినవి తప్ప మనుషులకు కాదు అన్నది స్పష్టం.ఈ ఆన్‌లైన్ హింసతో పాటు ఆమె ప్రాణాలు తీస్తామని, లైంగికదాడి చేస్తామన్న బెదిరింపులు సరేసరి. ఆమెకు ప్రాణహాని ఉందని ఐదుగురు ఐరాస ప్రతినిధులు 2018లోనే హెచ్చరికను జారీచేశారు. ఇక ఆల్ జజీరా యాంకర్ ఘదా క్వియిస్ గురించి ఒక మహిళ మీద ఎన్ని తప్పుడు ప్రచారాలు చేయవచ్చో అన్నీ చేశారు. గుజరాత్ మారణకాండ గురించి డాక్యుమెంటరీ నిర్మించిన బిబిసి మీద ఉక్రోషంతో దాని కార్యాలయాల మీద జరిపించిన దాడుల గురించి చూసిన తరువాత మన దేశంలో భిన్న గళాలను అణచివేసేందుకే కేంద్ర ప్రభుత్వం పూనుకున్నదని మరోసారి స్పష్టమైంది. జర్నలిస్టులను బెదిరించటమే కాదు, వారికి ప్రాణహాని కూడా ప్రపంచమంతటా ఉన్నదని చెబుతున్న నివేదికలు మన దేశంలోని ప్రజాస్వామ్యవాదులకు ఒక హెచ్చరిక కావాలి. తన ఎన్నిక కేసులో ఓడిన ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించి పత్రికల మీద సెన్సారు పేరుతో వ్యతిరేక వార్తలను నిషేధించిన దానికి, బిబిసి డాక్యుమెంటరీని సామాజిక మాధ్యమాల్లో నిషేధించిన నరేంద్రమోడీ సర్కార్ నిర్వాకానికి పెద్ద తేడా లేదు. ఇది ఒక ట్రైలర్ మాత్రమే, సినిమా ఎలా ఉంటుందో ఊహించుకోవాల్సిందే!

గుళ్లో దేవుడు లేడు : రవీంద్రనాథ్ టాగూర్

విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ (1861-1941), సాహిత్యంలో నోబెల్ బహుమతి సాధించిన భారతీయుడిగా మనందరికీ తెలుసు. గీతాంజలి -రచనకు 1913లో ఆ గౌరవం ఆయనకు దక్కింది. ఆయన హేతువాదో, నిరీశ్వరవాదో కాదు. అయినా కూడా, దేవుడి పట్ల ఆయన తన అభిప్రాయం స్పష్టంగానే చెప్పారు. I LOVE THE GOD, BECAUSE HE GIVES ME THE FREEDOM TO DENY HIM. (నేను దేవుణ్ణి ప్రేమిస్తాను. ఎందుకంటే, ఆయనను తిరస్కరించే స్వేచ్ఛ ఆయన నాకు ఇస్తాడు కాబట్టి!) అని మార్మికంగా చెప్పారు. ఇదే విషయం మీద ఆయన రాసిన చిన్న కథను తెలుగులో పొందుపరుస్తున్నాను.

*** *** ***

"గుళ్లో దేవుడు లేడు" అని అన్నాడు సాధువు. రాజుకు కోపం వచ్చింది... "ఏమిటీ? గుళ్లో దేవుడు లేడా? ఏమిటీ? మీరు నాస్తికుడిలా మాట్లాడుతున్నారూ? మహాత్మా! అమూల్యమైన వజ్ర వైడూర్యాలతో పొదగబడిన సింహాసనంపై మెరుస్తున్న ఆ బంగారు ప్రతిమను చూసి కూడా మీరు దేవుడు లేడు అని అంటే నేనేమి చెప్పేదీ?"



డాక్టర్ దేవరాజు మహారాజు

"నిజమే! అది రాచరికపు ఆర్భాటాలతో రాజసంతో విరాజిల్లుతూ ఉంది. కాదనను కానీ, అది ప్రతిమ మాత్రమే! దేవుడు అనేవాడు ఎక్కడా లేడు" సౌమ్యంగా బదులిచ్చాడు సాధువు. రాజుకోపంతో ఊగిపోయాడు. "20లక్షల బంగారు నాణాలు ధారపోసి ఆకాశాన్నంటే అద్భుతమైన ఈ భారీ కట్టడం కట్టించాను కదా? అన్ని ఆచారాలు పాటించాకే సంప్రదాయ బద్ధంగా విగ్రహ ప్రతిష్ఠ చేయించాను కదా? అయినా మీరు గుడిలో దేవుడు లేడని అంటున్నారే? మీ వివేకం ఏమయ్యింది మహాత్మా? ఎందుకు అలా మాట్లాడుతున్నారూ?" కసిగా పెద్ద గొంతుతో అన్నాడు రాజు. అందుకు సాధువు ప్రశాంత వదనంతో ఇలా అన్నాడు.

"ఇదే సంవత్సరం రెండు కోట్ల మంది నీ ప్రజలు కరువులో విలవిల్లాడారే? వేల మంది భిక్షకోసం నీ ఇంటిముందు నిలబడి అర్థించారే. అయినా ఉట్టి చేతులతో నిరాశతో తిరిగి పొయ్యారే-గుర్తుంది కదా? అప్పుడే దేవుడు ఈ ఆలయం వదిలి వెళ్ళిపోయాడు. కష్టకాలంలో తన వారికి అండగా నిలబడని ఓ లోభి నాకు ఇల్లు కట్టిస్తే... అందులో నేను ఎలా ఉండగలనూ? ప్రేమ, కరుణ, అహింసలు లేని చోట నేనెలా ఉండగలనూ?... అంటూ దేవుడు ఈ దేవాలయం వదిలి వెళ్ళిన విషయం నువ్వు గమనించలేదా రాజా..." అన్నాడు సాధువు.

"అవునా? అయితే ఆయన ఎక్కడికి వెళ్ళాడూ?" కంగారుగా అడిగాడు రాజు.

"రహదారికి ఇరువైపులా పడి ఆకలితో తల్లడిల్లుతున్న పేదల వద్దకు పోయాడు. సముద్రపు నురగవలె నువ్వు కట్టించిన గుడి అంతా శూన్యం. అందులో ఇక ఏమీ లేదు. ఏమీ ఉండదు" నింపాదిగా చెప్పాడు సాధువు.

"నువ్వో మోసగాడివని గ్రహించాను. నీకు దేశ బహిష్కరణ శిక్ష విధిస్తున్నాను" అని అరిచాడు రాజు.

"అక్కర లేదు. నేనే నీ రాజ్యం వదిలి వెళుతున్నాను. దయ, మానవత్వం లేని ఈ చోటుని దేవుడే విడిచి వెళ్ళాడు. నువ్వు కట్టించిన గుడినీ, నీ రాజ్యాన్నీ వదిలి వెళ్ళిపోయాడు. మరి, నేను మాత్రం ఇక్కడ ఎలా ఉండగలనూ? నీ సంపదను చూసుకుని మురిసిపోతున్నావ్. అహంకారంతో దేవుణ్ణి వెళ్ళగొట్టిన వాడివి. దయచేసి నీ భక్తిని కూడా వదిలేయ్. బాగుపడతావ్" అని చెపుతూ సాధువు అక్కడి నుంచి కదిలాడు. "దేవుడంటే ప్రతిమ కాదు, సేవా భావం! మానవత్వం!! అవి లేని వాడి దగ్గర నేను మాత్రం ఎందుకుంటానూ?" అని అనుకుంటూ సాధువు వెళ్ళిపోయాడు.

*** *** ***

రవీంద్రుడు విశ్వకవి గనుక, ప్రపంచ స్థాయి రచయిత గనుక, ఆయన చెప్పాలనుకున్నది ఈ కథలో స్పష్టంగానే చెప్పారు. ఎవరైనా అర్థం చేసుకోలేకపోతే అది వారి తప్పు. రవీంద్రుడిది కాదు. 2022 జులై చివరిలో 'నేనంటే ఎవరు?' రచనకు కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు స్వీకరించడానికి నేను కలకత్తా వెళ్ళినప్పుడు జొరసంకో -తాకూర్ బారి (రవీంద్రుడి ఇల్లు) వెళ్ళి చూశాం. ఇల్లంతా తిరుగుతూ ఉంటే, గదులన్నీ పరిశీలిస్తూ ఉంటే ఒక చిత్రమైన అనుభూతికి లోనయ్యాను. ఆ ఇంట్లో ఆయన పుట్టిన గది, పెరిగి తిరుగాడిన వరండాలు, అతిథులను కలిసే హాలు, రాసుకునే బల్ల, ఆయన పడక గది, దాని పక్కనే ఆయన కన్ను మూసిన గది- చూసే సరికి అవన్నీ అప్పుడే నా కళ్ళముందు జరిగిపోయాయన్న భావన! భావుకతను కాలం అడ్డుకోలేదు కదా? సముద్రంలోంచి విడివడ్డ ఒక నీటి చుక్కవలె నేను బయటికి నడుస్తున్నప్పుడు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఎందుకో బరువెక్కాయి.

ఎవరు రాశారో తెలియదు గానీ, దాదాపు ఇలాంటి కల్పిత కథే మరొకటి ఉంది. కథ కల్పితమే అయినా, సారాంశం సమాజ వాస్తవికతను ప్రతిబింబించేదే! అది ఇలా సాగుతుంది.

*** *** ***

ఒకసారి దెయ్యం, మనిషీ కలిసి హాయిగా వెన్నెల్లో నడిచి వెళుతున్నారు. వారికి ముందు మరొకరు నడిచి వెళుతున్నారు.

"అదెవరూ?" అని అడిగాడు మనిషి.

"ఇంకెవరూ? నీకు లాంటి ఓ మనిషే! మన ముందు నడుస్తున్నాడు" అంది దెయ్యం. కొద్ది దూరం వెళ్ళాక ముందు నడిచే వ్యక్తి ఆగి, నేలను పరీక్షగా చూసి, ఏదో చేతిలోకి తీసుకుని, గబగబా పరుగులాంటి నడకతో ముందుకు వెళ్ళాడు. అది గమనించిన మనిషి మళ్ళీ అడిగాడు.

"అదేమిటీ? అతనికి అక్కడ ఏదో దొరికింది" అన్నాడు.

"అవును! అతనికి అక్కడ 'సత్యం' దొరికింది" అంది దెయ్యం.

1980లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో సర్వమత సభలు జరిగాయి. ఇందులో ప్రపంచంలోని పద్నాలుగు మతాలకు చెందిన మతాధికారులు, పీఠాధిపతులు, స్వామీజీలు, పాస్టర్లు, ఇమామ్‌లు అందరూ పాల్గొన్నారు. దేవుడు ఉన్నాడా లేడా అనే విషయం మీద మూడు రోజులు ఏకధాటిగా చర్చలు జరిగాయి. చివరకు ఏకగ్రీవంగా అందరూ తీర్మానించింది ఏమిటంటే... "నమ్మిన వారికి దేవుడున్నాడు. దెయ్యమూ ఉంది - నమ్మనివారికి ఏమీ లేదు"అని! కాబట్టి, గుడి, మసీదు, చర్చి, గురుద్వారా లాంటి అన్ని ప్రార్థనా స్థలాలలో ఈ తీర్మానాన్ని స్పష్టంగా రాసి బోర్డులు పెట్టాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. కానీ, ఒక్కచోట కూడా ఏ ఒక్కరూ అలా ఎందుకు బోర్డులు పెట్టడం లేదు? జనాన్ని ఎందుకు ఆలోచించుకోనివ్వడం లేదూ? మత పెద్దలు ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకోవాలి!

"దానితో అతనేం చేస్తాడూ?" -మనిషి

"ఏం చేస్తాడూ? తన బంధు మిత్రులకు గొప్పగా చూపించుకుంటాడు" - అని చెప్పింది దెయ్యం. "ఇతను చెబితే వాళ్ళంతా నమ్మేస్తారా?"

దయ్యం పెద్దగా నవ్వింది. "నమ్మినా, నమ్మక పోయినా వాళ్ళంతా కలిసి ఆ సత్యానికి అక్కడ ఓ గుడి కడతారు" అని చెప్పింది.


"గుడి కడితే సత్యం అందులో ఉండి పోతుందా?" అడిగాడు మనిషి అమాయకంగా - దెయ్యం మరింత పెద్దగా నవ్వింది.

"పిచ్చివాడా! నీకు తెలియదేమో. సత్యాన్ని బయట వీధిలో పడేసిన తరువాతే గుళ్ళో ఓ బొమ్మకు ప్రాణ ప్రతిష్ఠ చేస్తారు. అలాఓ శూన్యానికి పూజలు, భజనలు చేస్తుంటారు.

"మరి అప్పుడేమవుతుందీ?"

"ఏమవుతుందంటే... అప్పుడే నా పని మొదలవుతుంది. బయటపడేసిన సత్యాన్ని నేను చేజిక్కించుకుంటాను. దానితో ఇక ఓ ఆట ఆడిస్తాను చూస్కో - లోకంలో మారణ కాండ జరిపిస్తాను. పాలకుల మూర్ఖత్వాన్ని ఉపయోగించుకుని, మతకలహాలు, కొట్లాటలూ, సృష్టిస్తాను. అలా చూపిస్తానన్న మాట నా తడాఖా" అంది దెయ్యం! మనిషి భయకంపితుడయ్యాడు.

మన భారతదేశంలోని విద్యా సంస్థల్లో ఇటీవలి కాలంలో ఏం జరుగుతూ ఉందో మనందరికీ తెలుసు. బెంగుళూరు మహానగర పాలక సంస్థ, బెంగుళూరు విశ్వవిద్యాలయంలో ఆలయం నిర్మించాలని నిర్ణయించింది. విద్యార్థులు తీవ్రంగా నిరసించారు. ఆ స్థలంలో గ్రంథాలయం నిర్మిస్తే విద్యార్థులందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డిమాండ్ చేశారు. కర్నాటక రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను కాషాయీకరణ చేయాలని కుట్ర చేస్తోందని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం అయ్యింది.



*** *** ***

ఈ కథలో మనిషితో కలిసి నడిచే దెయ్యం అంటూ ఏదీలేదు. అది మనిషిలోని వికృత భావనలకు ఒక సంకేతం! మనిషిలో మంచీ చెడూ ఎప్పుడూ కలిసే ఉంటాయి. అందులో అతను దేన్ని ఎప్పుడు ఎలా ఉపయోగిస్తాడన్న దాని మీదే సమాజ క్షేమం ఉంటుంది. ప్రజల జీవితాల్లో శాంతి భద్రతలు ఉంటాయి.

1980లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో సర్వమత సభలు జరిగాయి. ఇందులో ప్రపంచంలోని పద్నాలుగు మతాలకు చెందిన మతాధికారులు, పీఠాధిపతులు, స్వామీజీలు, పాస్టర్లు, ఇమామ్‌లు అందరూ పాల్గొన్నారు. దేవుడు ఉన్నాడా లేడా అనే విషయం మీద మూడు రోజులు ఏకధాటిగా చర్చలు జరిగాయి. చివరకు ఏకగ్రీవంగా అందరూ తీర్మానించింది ఏమిటంటే... "నమ్మిన వారికి దేవుడున్నాడు. దెయ్యమూ ఉంది - నమ్మనివారికి ఏమీ లేదు"అని! కాబట్టి, గుడి, మసీదు, చర్చి, గురుద్వారా లాంటి అన్ని ప్రార్థనా స్థలాలలో ఈ తీర్మానాన్ని స్పష్టంగా రాసి బోర్డులు పెట్టాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. కానీ, ఒక్కచోట కూడా ఏ ఒక్కరూ అలా ఎందుకు బోర్డులు పెట్టడం లేదు? జనాన్ని ఎందుకు ఆలోచించుకోనివ్వడం లేదూ? మత పెద్దలు ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకోవాలి! ఇచ్చుకోకపోతే పెద్ద ఎత్తున సర్వమత మహాసభలు నిర్వహించడం అందులో తీర్మానం చేయడం ఎందుకూ? వృథా ప్రయాస? సామాన్య ప్రజలకు ఏదో ఒక సందేశం ఇస్తే కదా ఆ సభల నిర్వహణ సార్థకమైనట్టూ? పురాతన ధార్మిక సంస్థలలో, గుడి, చర్చ్, మసీదు లాంటి ప్రార్థనా స్థలాలలో ఏదైనా అద్భుతం దాగి ఉందంటే... అది మతానిదో, దేవుడిదో కాదు. వాటిని నిర్మించిన మనిషిదే ఆ గొప్పదనం. జనం ఈ సత్యాన్ని గ్రహిస్తే నగం సమస్యలు పరిష్కారమవుతాయి.

"విద్యార్థుల ఇష్టంతోనూ, వారి మేధస్సుతోనూ వారిలో పెరుగుతున్న చైతన్యంతోనూ సంబంధం లేకుండా వారిపై ఒక ముందస్తు లక్ష్యాన్ని రుద్దే విధంగా విద్యాలయాలు ఉండగూడదు. విద్యాలయాల్లో వారికి స్వేచ్ఛ ఉండాలి. స్వేచ్ఛగా సృజన చేసే అవకాశం ఉండాలి. అంతేగాని, అవి బానిసత్వంతో కూడిన యాంత్రికమైన కచ్చితమైన లక్ష్యాలు సాధించే విధంగా ఉండగూడదు."

- అంటోనియో గ్రాంసి;
ఇటాలియన్ మార్క్సిస్టు తత్త్వవేత్త.

మన భారతదేశంలోని విద్యా సంస్థల్లో ఇటీవలి కాలంలో ఏం జరుగుతూ ఉందో మనందరికీ తెలుసు. బెంగుళూరు మహానగర పాలక సంస్థ, బెంగుళూరు విశ్వవిద్యాలయంలో ఆలయం నిర్మించాలని నిర్ణయించింది. విద్యార్థులు తీవ్రంగా నిరసించారు. ఆ స్థలంలో గ్రంథాలయం నిర్మిస్తే విద్యార్థులందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డిమాండ్ చేశారు. కర్నాటక రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను కాషాయీకరణ చేయాలని కుట్ర చేస్తోందని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం అయ్యింది.

"కర్మ నుదిటిరాత, పునర్జన్మ సుకృతం అనే నమ్మకాలు దేశ ప్రగతికి అవరోధం. కులం, మతం ప్రాతిపదికగా గాక, లౌకికవాదం ప్రాతిపదికగా, సమానత్వం ఆధారంగా భారత పౌరులు మెలగాలి" అని సూచించారు. ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య. భారతరత్న సాధించిన ఈ కన్నడి గుడి మాట నేటి ఈ కన్నడ రాష్ట్ర ప్రభుత్వపు చెవికి ఎక్కడం లేదా?

వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.



వెట్టి చాకిరీలో 'పశుమిత్ర'లు

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముకగా ఉంటే వ్యవసాయానికి పశుసంపద వెన్నెముకగా ఉంది. తెలంగాణ ఎట్ ఎ గ్లాన్స్ అధ్యయనం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 2023 నాటికి మూడు కోట్ల యాభై లక్షల పశు సంపద ఉంటుందని అంచనా. రాష్ట్రంలో 70శాతం జనాభా వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. పాడి పశువుల పెంపకం చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ వనరుగా ఉండగా నిరుపేద కూలీలకు ప్రధాన జీవనోపాధి కల్పిస్తోంది. నేడు రాష్ట్రంలో సుమారు 29లక్షల కుటుంబాలు పశుపోషణ పై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు.

పశు సంవర్ధకశాఖ ప్రధాన ఉద్దేశం సమస్త మానవాళికి బలవర్ధకమైన ఆహారంగా పాలు, గుడ్లు, మాంసం అందించడం. వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషణ చేపట్టడం ద్వారా పేద, నిరుపేదలకు సంవత్సరమంతా నిలకడైన ఆదాయం లభించేలా చూడటం. ఇందుకోసం గ్రామ స్థాయిలో ఉత్పత్తి దారుల సంఘాలను ఏర్పాటు చేసి శాస్త్రీయ పద్ధతులలో పశుపోషణ చేపట్టి, అదనపు ఉత్పత్తిని సాధించడం ప్రభుత్వ లక్ష్యం.

జాతీయ వ్యవసాయ కమిషన్ సూచనల ప్రకారం ప్రతీ ఐదువేల పశువులకు ఒక వెటర్నరీ ఉండాల్సి ఉండగా మన రాష్ట్రంలో ఇరవై వేల పశువులకు కూడా లేదు. పశువైద్యం అందుబాటులో లేక రైతులు అవస్థలు పడుతున్నారు. చాలా గ్రామాలలో పశువుల ఆరోగ్యానికి సంబంధించిన సూచనలు, సలహాలు అందుబాటులో లేక పశువులు వ్యాధుల బారినపడి మృత్యువాత పడుతు న్నాయి. దీన్ని నివారించి పశువులకు క్షేత్ర స్థాయిలో ప్రాథమిక వైద్యం అందించడానికి స్వయం సహాయక బృందాలలో చురుకుగా ఉన్న మహిళలను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చి రైతుల ఇంటి ముంగిటే పశు వైద్య సేవలు అందిచడానికి ప్రభుత్వం కేంద్ర గ్రామీణ ఆరోగ్య మిషన్ నిధులతో సెర్ప్ సంస్థ ద్వారా పశుమిత్రలను నియమించింది.



కాసు మాధవి

దేశంలో వ్యవసాయ సంబంధిత ఆర్థికాభివృద్ధిలో ప్రముఖమైన పశు సంపదకు గ్రామ స్థాయిలో పశుమిత్రలు నిరంతరం అందుబాటులో ఉంటారు. వీరు వెనుకబడిన సామజిక తరగతుల పేద మహిళలు. మూగ జీవాలకు కండ్లు, ముక్కు, నోటి నుండి నీరు కారుట, ముట్టి తడి ఆరిపోయి ఉండుట, కుడితి తాగకపోవుట, మేత మేయక పోవుట, నెమరవేయకుండుట, పేడ పలుచగా ఎక్కువ సార్లు వేయుట వంటి లక్షణాలను ఎంతో నైపుణ్యంతో గుర్తించడం తోపాటు పురుగులు పడి చీము నెత్తురు కారుతున్న పశువులను అదుపులోనికి తెచ్చుకొని వాటి గాయాలకు ప్రాథమిక వైద్యం చేస్తారు. పశువులకు సోకే ఇరవై రకాల వ్యాధులకు, వైరస్‌లకు వ్యాక్సిన్లు వేస్తూ ప్రథమ చికిత్స చేస్తారు. వైద్యం చేస్తున్న క్రమంలో వాటి దాడులకు గురవుతూ, పశు వైరస్‌లు అంటుకొని అనారోగ్యానికి గురవుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత గల పని చేస్తున్న పశుమిత్రలకు ఎలాంటి వేతనం లేదు. గుర్తింపు కార్డులు లేవు. ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం లేదు. ప్రమాద బీమాలేదు. యూనిఫాం లేదు. ఇతర మౌలిక సదుపాయాలు లేకుండా ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకోవడం దుర్మార్గం. దేశ ప్రజలందరికీ ఉపాధి చూపవలసిన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి స్కీమ్ వర్కర్ల పేరిట కార్మికుల శ్రమను దోచుకోవడం బాధ్యతా రాహిత్యం. ఇతర స్కీమ్ వర్కర్లకు ఇస్తున్నట్టుగా పశుమిత్రలకు కూడా వేతనం నిర్ణయించి బడ్జెట్ కేటాయించాలి.

రైతులకు సబ్సిడీ మీద పశువులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వం పశువుల ఆరోగ్య పరిరక్షణ చేస్తున్న పశుమిత్రలకు వేతనం ఇవ్వకుండా రైతుల వద్దనే సేవా రుసుం వసూలు చేసుకోమనడం సరైందికాదు. ఇది రైతుల నెత్తిన భారం మోపడమే. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అంటున్న ముఖ్యమంత్రి రైతుపై భారం మోపకుండా, పశుమిత్రల పనిని గుర్తించి పనికి తగిన వేతనం చెల్లించే వరకు రైతులను కలుపుకుని పశుమిత్రలు ఐక్య ఉద్యమానికి సిద్ధం కావాలి.

సెల్:9492585106

ప్రజల్లో మత చీలికలు... ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ వ్యూహం

బక్కపల్చటి శరీరం, చారెడంత గోధుమ రంగు కళ్లు వున్న ఆమె... చేతుల మీది గాయాలు కనిపించకుండా శాలువా చుట్టుకుంది. గొంతు మృదువుగా ఉన్నప్పటికీ మనుగడ కోసం చేసిన పోరాటాల లోంచి వచ్చిన గంభీరత ఆమె స్వరంలో ధ్వనించింది. ఆమె ఇలా చెప్పింది... "మా గ్రామం (రామావంద్)లోని సంస్కృత భవన్‌లో సమావేశాలు జరిగేవి. ఆదివారం ప్రార్థనలకు వెళ్లవద్దని అక్కడ హెచ్చరిం చారు. డిసెంబర్ 27న నా భర్తను బైటకు లాగి కొట్టడం మొదలుపెట్టారు. తనను ఫుట్‌బాల్ మాదిరిగా అందరూ వంతులవారీగా తన్నారు. గ్రామ పెద్దలకు బంధువులైన ఆరుగురు మహిళలు నన్ను ఒడిసి పట్టుకున్నారు. మగవాళ్ళు నన్ను నోటికొచ్చినట్లు తిడుతూ, నాకు గుణపాఠం నేర్పమని వారికి చెప్పారు. నా జుట్టు పట్టుకుని పీకారు. నా తల మీద పదే పదే కొట్టారు. అంటితో ఆగక తలను నేలకేసి కొట్టారు. ఈ ఘర్షణలో నా జాకెట్ చిరిగిపోయింది. మా గ్రామంలో క్రీస్తును నమ్మిన పదకొండు మంది మహిళలు, ఒక యువకుడితో సహా అందరూ ఇలాంటి హింసను ఎదుర్కొన్నారు. మీరు ప్రశాంతంగా బతకాలను కుంటే మా సమాజానికి తిరిగి రండి ('ఘర్ వాపస్') అన్నారు. నేను ఎలాంటి తప్పు చేయలేదు. ప్రార్థనలు మాత్రమే చేశానన్నాను". ఆమెకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదైంది. కానీ ఎటువంటి చర్య తీసుకోలేదు.



బృందా కరత్

ఉత్తర బస్తర్‌లోని కంకేర్, కొండగావ్, నారాయణపూర్ జిల్లాల్లోని క్రైస్తవ సమాజానికి చెందిన 500 ఆదివాసీ కుటుంబాలలో ఆమె కుటుంబం కూడా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో, గత ఏడాది అక్టోబర్ నుంచి తమపై జరిగిన మూకుమ్మడి దాడుల కారణంగా వారు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రతినిధి బృందంతో కలిసి ఇటీవల బాధిత ప్రాంతాలకు వెళ్లినప్పుడు మహిళల మీద జరిగిన అత్యంత క్రూరమైన దాడుల గురించి చాలా తక్కువగా పేర్కొన్నారు. డిసెంబరులో 1,500 మంది ప్రజలు తమ ఇళ్లను విడిచిపెట్టి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాలు, చర్చిలు, బంధువులు-స్నేహితుల ఇళ్లలో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. 200 మందికి పైగా ఇప్పటికీ తిరిగి స్వగ్రామాలకు రాలేకపోయారు. నారాయణపూర్‌లోని ప్రధాన చర్చి, "ప్రార్థన గదులు"తో సహా ఇతర జిల్లాల్లోని చర్చిలను ధ్వంసం చేశారు. కొన్ని చోట్ల దగ్ధం చేశారు. ఇళ్లను పగలగొట్టి దోచుకున్నారు. నారాయణపూర్ చర్చిపై దాడి కేసుకు సంబంధించి అరెస్టయిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఇతర స్థానిక నాయకులు ఉన్నారు.

మత మార్పిళ్లకు వ్యతిరేకంగా భజరంగ్ దళ్, విహెచ్‌పి వంటి ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థల నేతృత్వంలోని "ఘర్ వాపసీ" ప్రచారం కొత్తదేమీ కాదు. తేడా ఏమిటంటే ఈసారి 'జన్ జాతి సురక్షా మంచ్' (జెఎస్ఎం) వంటి వేదికలను సృష్టించడం ద్వారా, మత మార్పిళ్ల నుంచి తమ సంప్రదాయాలను రక్షించుకోడానికి ఆదివాసీలు స్వయంగా లేవనెత్తిన ఒక ఆకస్మిక ఉద్యమంగా దీనిని చూపించారు. అయితే ఇది అలాంటిది కాదు.

నవంబర్ మొదటి వారంలో, జెఎస్ఎం చేసిన నిరసన ప్రదర్శనకు ఆ ప్రాంతానికి చెందిన మాజీ బీజేపీ ఎమ్మెల్యే, గిరిజన నేత నాయకత్వం వహించారు. కామెర్ల వ్యాధితో మరణించిన 55ఏండ్ల ఆదివాసీ క్రైస్తవ మహిళ చైతీ బాయి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తమ సొంత భూమిలో పూడ్చిపెట్టాలని డిమాండ్ చేస్తూ రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. గ్రామంలో ఒక క్రైస్తవుని ఖననం చేయడం గ్రామ దేవతకు కోపం తెప్పిస్తుంది. గ్రామాన్ని నాశనం చేస్తుంది' అని చెప్పుకొచ్చాడు. చైతీ బాయి కుటుంబానికి ఎంతగా బెదిరింపులు వచ్చాయంటే... వారు గ్రామం విడిచి వెళ్లిపోయేంతగా. మరుసటి రోజు రాత్రి అతని అనుచరులు సమాధిని తవ్వి ఆమె మృతదేహాన్ని బయటకు లాగారు. ఇలాంటి చట్టవిరుద్ధమైన, అనాగరికమైన చర్యపై అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా మృతదేహాన్ని తీసుకెళ్లి 100కిలోమీటర్ల దూరంలోని క్రైస్తవ శ్మశానవాటికలో పాతిపెట్టింది. దీంతో జెఎస్ఎం ఇటువంటి మరిన్ని చర్యలకు పాల్పడేందుకు ఊతమిచ్చినట్లయింది. దాంతో క్రైస్తవుల మీద హింసాత్మక దాడులు మరింత పెరిగాయి.



ఇలాంటి చర్యలకు ఆదివాసీ సంస్కృతుల రక్షణకు ఎటువంటి సంబంధం లేదు. చనిపోయినవారిని ఆదివాసీలు పాతిపెడతారు. చనిపోయినవారిని క్రైస్తవులు తమ స్వంత భూమిలో పాతిపెట్టినప్పుడు... భారతదేశంలో ఆదివాసీలు నివసించే ఏ ప్రాంతంలోనూ సమస్య కాలేదు. ఇది ఆదివాసీ సంస్కృతులను హిందుత్వీకరించేందుకు తయారు చేసిన ఎజెండా మాదిరిగా కనిపిస్తోంది.

ఛత్తీస్‌గఢ్‌లో 2006లో అప్పటి బీజేపీ ప్రభుత్వ హయాంలో బలవంతపు మత మార్పిళ్లకు వ్యతిరేకంగా ఒక చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే ప్రస్తుతం మత మార్పిళ్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారానికి భిన్నంగా... బలవంతంగా మత మార్పిడి చేసినట్లుగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మనస్సాక్షి స్వేచ్ఛకు రాజ్యాంగం కల్పించిన హక్కుపై దాడి జరుగుతోంది.

ఆదివాసీ ప్రాంతాలలో దేవాలయాలు నిర్మించ బడుతున్నాయి. కీర్తనలు, భజన మండళ్లు నిర్వహించ బడుతున్నాయి. ఆదివాసీ విశ్వాసాలు, సంస్కృతులకు దూరంగా విగ్రహారాధనకు అనుసంధానించబడిన ఆచారాలు బహిరంగంగా ప్రచారం చేయబడుతున్నాయి. ఆదివాసీ సంప్రదాయాల దృష్టి కోణం నుండి చూసినట్లయితే వాటిని వారి మీద రుద్దినట్టుగా పరిగణించవచ్చు. మత మార్పిడికి ఏర్పాటు చేసినట్టు భావించవచ్చు. ఆదివాసీలలోని క్రైస్తవ విశ్వాసులను "ఇంటికి తిరిగి" రమ్మని బెదిరించినప్పుడు, ఏ ఇంటిని సూచిస్తారు? ఇతర మతాల నుండి వేరుగా ఉన్న ఆదివాసీల నమ్మకాలు, విశ్వాసాలను సూచించడానికి వీలుగా జనగణన పత్రంలో "సర్నా, ఆదివాసీ" కాలమ్‌ను జోడించాలన్న తీర్మానాన్ని జార్ఖండ్‌లోని జెఎంఎం ప్రభుత్వం నేతృత్వంలోని అసెంబ్లీ ఆమోదించింది.

రెండు ఇనుప ఖనిజం ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నారాయణపూర్‌లోని ఆదివాసీలు పోరాడుతున్నారు. చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా గ్రామసభల అనుమతి లేకుండానే ఈ ప్రాజెక్టులను తీసుకొచ్చారు. సుప్రీంకోర్టు నిలిపివేసిన ఒడిశా నియమ్‌గిరి ప్రాజెక్టు మాదిరిగానే... ఈ ప్రాజెక్టులు ఆదివాసీలు పవిత్రమైనవిగా భావించే ప్రాంతాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. దీనిపై జన్ జాతి సురక్షా మంచ్ మౌనంగా ఉంది. ఘర్ వాపసీ ప్రచారం ద్వారా... గ్రామసభ అనుమతి లేకుండా గ్రామాల్లోకి క్రైస్తవ పాస్టర్ల ప్రవేశాన్ని నిషేధించే తీర్మానాలను ఆమోదిస్తున్నారు. తద్వారా గ్రామసభ హక్కును వక్రీకరిస్తున్నారు.

ఈ ఏడాది చివర్లో రాష్ట్ర ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో... ప్రజల మధ్య చీలికలు సృష్టించి లబ్ధి పొందాలన్న బీజేపీ సహజమైన వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఆ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఒక్క మంత్రిని కూడా పంపని, ఒక్క బాధిత కుటుంబానికి కూడా నష్టపరిహారం అందించని కాంగ్రెస్ ప్రభుత్వం గురించి ఏం చెప్పాలి? చర్చిపై రాళ్ల దాడిలో ఒక పోలీసు అధికారి గాయపడిన తర్వాత మాత్రమే అరెస్టులు జరిగాయి. మహిళలతో సహా బాధితులు ఎన్ని ఫిర్యాదులు చేసినా, కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా వారెవరినీ అరెస్టు చేయలేదు. నారాయణపూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కూడా. సరిగ్గా బాధితులకు అత్యవసరమైన సందర్భాలలో ఆయన కనిపించకుండా తప్పకున్నారు. భారత దేశాన్ని ఏకం చేసే మార్గం ఇదేనా?

ఈ ఏడాది చివర్లో రాష్ట్ర ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో... ప్రజల మధ్య చీలికలు సృష్టించి లబ్ధి పొందాలన్న బీజేపీ సహజమైన వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఆ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఒక్క మంత్రిని కూడా పంపని, ఒక్క బాధిత కుటుంబానికి కూడా నష్టపరిహారం అందించని కాంగ్రెస్ ప్రభుత్వం గురించి ఏం చెప్పాలి?

చర్చిపై రాళ్ల దాడిలో ఒక పోలీసు అధికారి గాయపడిన తర్వాత మాత్రమే అరెస్టులు జరిగాయి. మహిళలతో సహా బాధితులు ఎన్ని ఫిర్యాదులు చేసినా, కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా వారెవరినీ అరెస్టు చేయలేదు. నారాయణపూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కూడా. సరిగ్గా బాధితులకు అత్యవసరమైన సందర్భాలలో ఆయన కనిపించకుండా తప్పుకున్నారు. భారత దేశాన్ని ఏకం చేసే మార్గం ఇదేనా?

- 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో

అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5 ఖమ్మం
శుక్రవారం 17 ఫిబ్రవరి 2023



మంచి పాలనకు పాలేరు నుంచే నాంది

- ఖమ్మం జిల్లా మాకు అండగా నిలిచింది
- చిత్తశుద్ధితో రాజకీయాలు చేయాలనే షర్మిల ప్రజాప్రస్తానం
- వైఎస్ఆర్‌టీపీ నాయకురాలు వైఎస్ విజయమ్మ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

వైఎస్ షర్మిల అడ్రస్ ఎక్కడా అంటే పాలేరు అనే చెబుతామని, రానున్న రాజకీయాలకు షర్మిల పాలేరు నిర్ణయం గుమ్మం అవుతుందని వైఎస్ఆర్‌టీపీ నాయకురాలు వైఎస్ విజయమ్మ అన్నారు. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధినేత వైఎస్ షర్మిల క్యాంపు కార్యాలయాన్ని ఖమ్మంరూరల్ మండలం పెద్దతండా పంచాయతీ పరిధిలోని సాయిగణేష్‌నగర్‌లో గురువారం వైఎస్ విజయమ్మ ప్రారంభించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విజయమ్మ మాట్లాడారు. వైఎస్ కుటుంబానికి పులివెందుల మాదిరిగానే షర్మిలకు పాలేరు నియోజకవర్గం ఉంటుందని, ఉండాలని వైఎస్ విజయమ్మ ఆకాంక్షించారు. వైఎస్ఆర్ కుటుంబ సభ్యులు ఎన్ని కష్టాలు వచ్చినా వెనుకడుగు వేయరని, షర్మిల మాటిస్తే కట్టుబడి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రసర్వతోముఖాభివృద్ధి కోసమే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు 7 వేల కిలో మీటర్ల నడిచిందంటేనే ఆమె పట్టుదల అర్థం చేసుకోవాలన్నారు. వైఎస్ఆర్‌కు పాలేరుకు రుణానుబంధం ఉందని, ఇదంతా దైవేచ్ఛే అన్నారు. ఎప్పుడో వైఎస్ పాలనలో మొదలుపెట్టిన ప్రాజెక్టులు ఇప్పటిదాకా పూర్తి చేయలేకపోయారని, షర్మిల చేతుల మీదుగా అవి ప్రారంభమౌతాయను కుంటా అన్నారు. జగన్ ఏపీలో ఉన్నప్పటికీ ఖమ్మం జిల్లా అండగా నిలిచిందని గుర్తుచేశారు. షర్మిల పాదయాత్ర, ఓదార్పు యాత్ర కూడా ఖమ్మం జిల్లాలో జరిగిందని గుర్తుచేశారు. షర్మిలకు భారీ మెజారిటీ ఇవ్వాలని పాలేరు ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు గట్టు రామచంద్రరావు, లక్కినేని సుధీర్, కల్పన, గాయత్రి, చైతన్యరెడ్డి, జెడ్పి మాజీ చైర్మన్ కవిత, నంద్యాల రవీందర్‌రెడ్డి, అంజన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు దేశానికి ఆదర్శం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శ ప్రాయమని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు పేర్కొన్నారు.ఎర్రుపాలెం మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో రైతు వేదిక నందు ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు, అనంతరం జమలాపురం, బంజర, ఎర్రుపాలెం, గ్రామ పంచాయతీల నందు సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం రైతులు సాగర్ జలాలను విడుదల చేయించాలని రైతులు పడుతున్న పలు సమస్యలను కమల రాజుకు వివరించగా, తక్షణమే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పువ్వాడ అజయ్ కుమార్‌తో రైతులు చెందుతున్న సమస్యను ఫోను ద్వారా సంప్రదించటంతో వెంటనే స్పందించి ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలియచేసినట్లు ఆయన తెలిపారు.అనంతరం పలు శుభ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మూల్పూరి స్వప్న, ఎంపీపీ దేవరకొండ శిరీష, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు పంబి సాంబశివ రావు, సొసైటీ అధ్యక్షులు మూల్పూరి శ్రీనివాసరావు, మొగిలి అప్పారావు, సగుర్తి కిషోర్ బాబు, ప్రజాప్రతినిధులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని భట్టికి వినతి

నవతెలంగాణ-ముదిగొండ

ముదిగొండ మండలంలోని వివిధ దినపత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఎల్పీ నేత మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కను ఖమ్మం క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఆవుల రామారావు, పుచ్చకాయల అచ్యుతరావు, కందిమల్ల వీరస్వామి, గోగుల వెంకటకృష్ణ, వనం కృష్ణకాంత్, నూకల వెంకటరమణ, దిగుట్ల లక్ష్మణ్, గొల్లపల్లి అప్పారావు, గడ్డం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో పెద్దమండవ గ్రామానికి చెందిన సింగు సూర్యనారాయణ అనే వ్యక్తి సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా సీఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ.60వేలు మంజూరు చేయగా ఆ చెక్కును గ్రామ ఉపసర్పంచ్ కోడె బాబు బాధితునికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పథకమును ప్రతి ఒక్కరు వినియోగించుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగంటి వెంకయ్య, భూసి వెంకటేశ్వర్లు, సింగ్ సుధీర్, కుక్కల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోవాలి : కాంగ్రెస్

నవతెలంగాణ - ఎర్రుపాలెం

నీళ్ల లేక ఎండి పోతున్న పైరులకు నాగార్జున సాగర్ జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో అతి ముఖ్యమైన కట్లేరు ప్రాజెక్ట్ కింద రబీ సాగు సుమారు 3 వేల ఎకరాలలో వరి సాగు చేస్తున్నారని, నీరు లేక వరి పంట ఎండిపోయే పరిస్థితి కనపడుతుందని, సంబంధిత జిల్లా అధికారులు నాగార్జున సాగర్ జలాలు వెంటనే విడుదల చేసి కట్లేరు ప్రాజెక్టుతో పాటు మండలంలోని అన్ని చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీనివాసరావు, కంచర్ల వెంకట నరసయ్య, మల్లెల లక్ష్మణరావు, షేక్ ఇస్మాయిల్, గుడేటి బాబురావు, భూక్య శ్రీను పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

నవతెలంగాణ-ముదిగొండ



మండలపరిధిలో వల్లాపురం గ్రామ సమీపన మున్నేరు వద్ద ఉన్న మల్లిఖార్జునస్వామి దేవాలయము మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయింది. ఈశివరాత్రి ఉత్సవాల జాతర ఈనెల 18 నుండి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు.ముదిగొండ,చింతకాని నేలకొండపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల నుండి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మున్నేరులో స్నానమార్చి తమ మొక్కలు చెల్లించుకుని మల్లిఖార్జునస్వామి దేవాలయమును సందర్శించి పూజలు నిర్వహించి కానుకలు సమర్పిస్తారు. ఈదేవాలయము పేరిట 57 ఎకరాల సాగు చేసే భూమి ఉంది. దేవాలయముకి వచ్చే కౌలుతోపాటు తిరునాళ్లకు లక్షల్లో ఆదాయము ఉంటుంది. దేవాలయానికి పాలకవర్గం కూడా నియమించబడింది. దేవాలయముకి వెళ్లే రహదారి మాత్రం దుమ్ముధులితో భక్తులకు అసౌకర్యంగా దర్శనమిస్తుంది. మండలస్థాయిలో వల్లాపురం జాతర మూడు రోజులపాటు నిర్వహించే మహాశివరాత్రి తిరునాళ్లకు భక్తులు, ఆటోలు ట్రాక్టర్లు, కార్లు ద్విచక్ర వాహనాలతో భారీసంఖ్యలో హాజరవుతారు. జాతరకు హాజరయ్యే భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో మంచినీటి వసతి, గుడారాలు ఏర్పాటు చేసినట్లు దేవాలయ ఈవో ప్రతానపు నారాయణచార్యులు గురువారం తెలిపారు. శని, ఆది, సోమవారం వరకు మహాశివరాత్రి జాతర కొనసాగుతుంది.

జ్యుడీషియల్ అధికారుల నివాస స్థల పరిశీలన

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

జ్యుడీషియల్ అధికారుల నివాస భవనాల కోసం ఖమ్మం అర్బన్ మండలం బురహాన్ పురం లోని సర్వే నెం. 98 లో కేటాయించిన స్థలాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. టి. శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జ్యుడీషియల్ అధికారుల క్వార్టర్ ల కొసం ప్రభుత్వం 3.08 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పరిశీలన సందర్భంగా జిల్లా కోర్టు సీఏఓ సూర్యనారాయణ మూర్తి, సెంట్రల్ నజీర్ రాధే శ్యామ్, రెవిన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.



'పొంగులేటి'వన్నీ అబద్ధాలే..!

- ఏడేళ్లుండి పార్టీకి ద్రోహం చేస్తావా?
- నాడు కేసీఆర్, కేటీఆర్ లను పొగడలేదా..?
- ఇప్పుడు నామస్మరణ అంటూ వాగుతావా?
- సీతారామ ప్రాజెక్టుకు ఎందుకు టెండర్ వేశావు?
- ధరణిలో నీ భూములు ఎంటర్ కాలేదా..?
- మాజీ ఎంపీపై ధ్వజమెత్తిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు,ఎమ్మెల్సీ తాతా మధు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మీయ సమ్మేళనాల్లో మాట్లాడేవన్నీ అబద్ధాలేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ధ్వజమెత్తారు. ఏడేళ్ల పాటు పార్టీలో ఉండి తన కలలన్నీ నెరవేర్చుకుని ఇప్పుడు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీకి ద్రోహం చేస్తుంది కాక నోటికి వచ్చినట్లు అవాకులు, చెవాకులు పేలుతున్నారని ఫైర్ అయ్యారు. జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని అన్నారు. ఈ క్రమంలోనే శ్రీనివాసరెడ్డి పార్టీలో చేరారని చెప్పారు. ఏడేళ్ల పాటు పార్టీలో ఉండి, తన కలలు నెరవేర్చుకుని రూ.300 కోట్లకు అధిపతి అయిన ఆయన ఇప్పుడు రూ.3వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని, బుధవారం వైరాలో జరిగిన కార్యక్రమంలో అన్ని అబద్ధాలే మాట్లాడారని దుయ్యబట్టారు. పార్టీలో ఉన్న నాయకులందరూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నామజపమే చేస్తున్నారని శ్రీనివాసరెడ్డి అన్నారని, ఆయన బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు ఎవరి జపం చేశారని ప్రశ్నించారు. నాడు పొగిడిన నోటితోనే నేడు ఆరోపణలు చేయడం ఆయన రాజకీయ పరిపక్వతకు అద్దం పడుతుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల గురించి కాకుండా మోదీ, రాహుల్ గాంధీ గురించి మాట్లాడుతారా? అని ప్రశ్నించారు.

మీ 108 ఎకరాలు ధరణిలో ఎంటర్ కాలేదా?

ధరణి తప్పుల కుప్పగా మారిందని పొంగులేటి అంటున్నారని ఆయనకు చెందిన 108 ఎకరాల భూములు ధరణిలో ఎంటర్ కాలేదా? అని తాతా మధుసూదన్ ప్రశ్నించారు. పాస్ బుక్కులు పొందలేదా? అన్నారు. కొత్త సాఫ్ట్ వేర్ లో చిన్నచిన్న పొరపాట్లు దొర్లడం సహజమని, అవికూడా లేకుండా చేస్తున్నామని స్పష్టం చేశారు.

సీతారామకు ఎందుకు టెండర్ వేశావు..?

సీతారామ ప్రాజెక్టు ఇంకా 15 ఏండ్లు అయినా పూర్తి కాదన్న పొంగులేటి మాటలకు తాత కౌంటర్ ఇచ్చారు. 15 ఏండ్లకు కూడా పూర్తి కాని ప్రాజెక్టుకు ఎందుకు టెండర్ వేశావని, టెండర్ వేసిన ఆధారాలు మొత్తం తన దగ్గర ఉన్నాయని విలేకరుల సమావేశంలో పత్రాలను చూపించారు. ఆర్థికంగా లబ్ధి పొందేందుకు మాత్రం టెండర్ వేస్తావా? తర్వాత ప్రాజెక్టు పూర్తవుతుందో.. లేదోనంటూ ప్రజలకు కల్లబొల్లి కబుర్లు చెబుతావా? అంటూ విమర్శించారు. మీరు విమర్శించే ప్రతీ మాటకు బీఆర్ఎస్ దగ్గర సమాధానం ఉన్నదని స్పష్టం చేశారు. పొంగులేటి ఏం చదువుకున్నాడో తనకైతే తెలియదు కానీ.. మానసిక పరిస్థితి మాత్రం బాగోలేదని అర్థం అవుతుందని అన్నారు. ప్రజా కోర్టులో తనకు శిక్ష పడటం ఖాయమని, ప్రజలు అన్ని గ్రహిస్తున్నారని, కర్రుకాల్చి వాత పెడతారని హెచ్చరించారు. పొంగులేటి ఏర్పాటుచేసుకునే సన్నాహక సమావేశాలకు బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకం కాదని, పార్టీలో ఉండి లబ్ధి పొంది, ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం తగదని హితవు పలికారు. సమావేశంలో డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఖమ్మం నగర మేయర్ నీరజ, ఖమ్మం నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, జిల్లా రైతు సమితి అధ్యక్షులు నల్లమల్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ కమర్తపు మురళి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఖమర్, తెలంగాణ ఉద్యమకారులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ జన్మదిన సందర్భంగా చెస్ టోర్ని

ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ

నవతెలంగాణ - ఖమ్మం



రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన మహిళల జిల్లా స్థాయి చెస్ పోటీలను గురువారం సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, నగర మేయర్ పునుకొల్లు నీరజ తో కలిసి ప్రారంభించారు. ఈ చెస్ పోటీలలో 150 మంది మహిళా చెస్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా కలెక్టర్, నగర మేయర్ లు క్రీడాకారుల తో చెస్ ఆడి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్ లో క్రీడాకారులు తమ ప్రతిభను చాటి, రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ఫలితాలను తేవాలని తెలిపారు. భవిష్యత్తు లో మరిన్ని చెస్ టోర్నమెంట్లను నిర్వహించి పాఠశాల, కళాశాలల విద్యార్థులలో ప్రతిభ కలవారిని ప్రోత్సహించాలని ఆయన అన్నారు. మొదటి, రెండవ స్థానంలో గెలుపొందిన వారు నేడు (శుక్రవారం) రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామని తెలిపారు. కొత్తగా మునిసిపల్ కార్పొరేషన్ లో ఏర్పాటు చేసిన చెస్ పార్క్ ను క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్జిఎఫ్ కార్యదర్శి కె. నరసింహా, రెడ్డివారి వనజా రెడ్డి జ్ఞాపకార్థం 60 టీ షర్టులను ప్రభుత్వ పాఠశాలల క్రీడాకారులకు జిల్లా కలెక్టర్, నగర మేయర్ లతో ఉచితంగా పంపిణీ చేశారు. స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ విద్యార్థులకు సర్టిఫికెట్ ల ప్రదానం చేశారు. ఈ చెస్ పోటీలలో జి. చరిష్మా, ఖమ్మం రూరల్, డి. దివ్య, మధిర, పి. సేతు శ్రీవల్లి ఖమ్మం, కె. కీర్తన, ఖమ్మం తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జిల్లా విద్యాధికారి సోమశేఖర్ శర్మ, డివైఎస్ఓ పరంధామ రెడ్డి, ఖమ్మం అర్బన్ ఎంఇఒ శ్రీనివాస్, చెస్ కోచ్ గోపి కష్ణ , పిడి రఘునందన్ రావు, వాలీబాల్ కోచ్ ఎండి. అక్బర్ అలీ, బాస్కెట్ బాల్ కోచ్ కె. సైదులు, టెన్నిస్ కోచ్ కైలాస్, స్కెటింగ్ కోచ్ సురేష్, షటిల్ కోచ్ పవన్, టేబుల్ టెన్నిస్ కోచ్ మూర్తి, ప్రభుత్వ పాఠశాలల పిఇటిలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తీర్థాల జాతరలో భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

ట్రాఫిక్ ఏసీపీ రామోజీ రమేష్

నవతెలంగాణ- ఖమ్మంరూరల్

మహాశివరాత్రి సందర్భంగా శ్రీ సంగమేశ్వర స్వామి అలయం తీర్థాల జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు ట్రాఫిక్ ఏసీపీ రామోజీ రమేష్ తెలిపారు. ఖమ్మంరూరల్ ఏసీపీ బస్వారెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తీర్థాల జాతరకు లక్షలాది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నాలుగు మార్గాలలో 131 ఎకారాలలో 36 ప్రాంతాలలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధానంగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులు దేవాలయం సమీపం (50 అడుగుల దూరం) వరకు అనుమతిస్తారని తెలిపారు. ఆర్టీసీ బస్సులు నడిపే మార్గాలు ఖమ్మం కొత్తబస్టాండ్, పాత బస్టాండ్ నుండి వచ్చే ఆర్టీసీ బస్సులు దానవాయిగూడెం, రామన్నపేట, కామంచికల్లు, తీర్థాల వంతెన మీదుగా పార్కింగ్ ప్రాంతాలలో చేరుకుంటాయి. తిరుగు ప్రయాణం ఇదే మార్గంలో ఖమ్మం వెళ్తాయని తెలిపారు. కామంచికల్లు వైపు -11, మంగళగూడెం వైపు -06, గోళ్లపాడు వైపు -15, తనకంపాడు వైపు -4 పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతర వాహనాలలో వచ్చే భక్తులు కోసం ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాలలో పార్కింగ్ చేసి నడిచి దర్శనానికి వెళ్లాలని సూచించారు. భక్తుల వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో వాహనాలు నిలిపాలని సూచించారు. ఇప్పటికే నిర్వహుకులు ఆలయ స్వాగత ద్వారం మొదలుకొని గర్భాలయం వరకు క్యూలైన్లు, చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యం ఇప్పటికే పూర్తి చేశారని తెలిపారు. స్నానపు ఘాట్, ఇతర ప్రాంతాలలో 20 సీసీ కెమెరాలు, నిరంతర విద్యుత్ కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు, అగ్నిమాపక సిబ్బంది, స్విమర్లు అందుబాటులో ఉండే విధంగా అధికారులతో సమన్వయం చేసుకోవటం జరిగిందన్నారు. భక్తుల వాహనాలు ఒవర్ టెక్ చేయకుండా క్యూలో రావాలని సూచించారు. రూరల్ సీఐ శ్రీనివాస్ ట్రాఫిక్ సిఐలు అంజలి, అశోక్, ఎస్సైలు వెంకటకృష్ణ, రవి పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

తెలంగాణ గిరిజన సంఘం డిమాండ్

నవతెలంగాణ-కొణిజర్ల



గిరిజన ఆశ్రమ పాఠశాలలో టీచర్ పోస్టులు లేక విద్యార్థులకు విద్య అందక అవస్థలు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బానోతు బాలాజీ, భూక్యా వీరభద్రం, కొణిజర్ల మండల అధ్యక్షులు తేజవత్ కృష్ణకాంత్‌లు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం కొణిజర్ల బస్వాపురం గిరిజన ఆశ్రమ బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను సంఘం నేతల దృష్టికి తీసుకువచ్చారు. ఇంగ్లీష్ విద్య అందుబాటులో లేక సరిపడా టీచర్ పోస్టులు లేకపోవటంతో విద్య అందట్లేదని ఆందోళన వ్యక్తం చేసినట్లు నాయకులు తెలిపారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుల తప్ప పర్మినెట్ పోస్టులు లేక ఆశ్రమ పాఠశాలలు అల్లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిడిఏ అధికారులు చొరవ ప్రదర్శించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నెలనెలా అందాల్సిన మెనూ బిల్లులు గత ఆరు నెలల నుంచి పెండింగ్ ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఆశ్రమ పాఠశాల భవనం జాలి లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, వెంటనే ఐరన్ జాలీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 25న కారేపల్లిలో జరుగు గిరిజన సంఘం జిల్లా మహాసభలో చర్చించి భవిష్యత్తు పోరాటాల రూపకల్పన చేస్తామని వారు తెలిపారు. 25న కారేపల్లిలో జరుగు భారీ ప్రదర్శనలో గిరిజనులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల 8వ వార్షికోత్సవం

నవతెలంగాణ-వైరా



వైరా న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాల 8వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భుమేశ్వరరావు తెలిపారు. వైరాలోని పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ కుర్రా సుమన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వార్షికోత్సవ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్, వైరా ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ముఖ్య అతిథులుగా హాజరవుతారని వివరించారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. వైరా నియోజకవర్గ విద్యారంగంలోనే న్యూ లిటిల్ ఫ్లవర్స్ కొత్త వరవడిని సృష్టించిందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్టేట్ సిలబస్‌తో పాటు సెంట్రల్ సిలబస్‌ను అందుబాటులోకి తెచ్చి నాణ్యమైన విద్యాబోధనలు అందిస్తున్నామని వివరించారు. గత ఎనిమిది సంవత్సరాలుగా తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. చదువుతోపాటు జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో కూడా తమ విద్యార్థులు రాణిస్తున్నారని వివరించారు. పాఠశాల వార్షికోత్సవానికి తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షాజీ మ్యాథ్యూ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన సర్పంచ్

నవతెలంగాణ -బోనకల్

మండల పరిధిలోని మోటమర్రిలో జిల్లా పరిషత్ గ్రాంట్, ఎంపీటీసీ గ్రాంట్ క్రింద కొత్తగా మంజూరైన సీసీ రోడ్లకు మోటమర్రి సర్పంచ్ కేతినేని ఇందు గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో పూర్తి చేసిన చేసి రోడ్లను, డ్రైనేజీ పనులను ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్ సందర్శించారు. మోటమర్రి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ముష్టికుంట్ల, పెద్దబీరవల్లి, రావినూతల, చిరునోముల, బోనకల్, బ్రాహ్మణపల్లి గ్రామాలలో అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలకు నీరు పట్టే విధానాన్ని ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఆయా గ్రామాలలో నిర్వహిస్తున్న నర్సరీలలో ఆ గ్రామాలకు అవసరమైన మొక్కలను పూర్తిస్థాయిలో పెంచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పంచాయతీ కార్యదర్శులు నల్లబెల్లి రఘు, గుడికందుల కోటేశ్వరరావు, జొన్నలగడ్డ అశోక్‌కుమార్, బంధం అర్జున్, దామల్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ పుట్టినరోజున సేవా కార్యక్రమాలు

బిఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు చింతనిప్పు కృష్ణ చైతన్య

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పుట్టినరోజు శుక్రవారం సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని బిఆర్ఎస్ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు చింతనిప్పు కృష్ణ చైతన్య తెలిపారు. యువజన విభాగం సభ్యులంతా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు సేవలు అందించాలని కోరారు. తెలంగాణ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి సీఎం కేసీఆర్ భారతదేశానికే రోల్ మోడల్ గా నిలిచారని పేర్కొన్నారు.; సీఎం కేసీఆర్ జన్మదినాన్ని ఒక పండుగలా ప్రజలకు అంకితం చేస్తూ సేవా కార్యక్రమాలతో నిర్వహించాలని పిలుపునిచ్చారు.



కంటివెలుగు క్యాంపును తనిఖీ చేసిన డిఎంహెచ్ఎం

నవతెలంగాణ-మధిర

తెలంగాణ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ తరపున ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.మాలతీ మధిర టౌన్‌లో బంజారా కాలనీలో ఎస్సి గర్ల్స్ హాస్టల్ జరుగుతున్న తెలంగాణ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, మధిర సివిల్ హాస్పిటల్ వైద్యులు డా.అనిల్ కుమార్, డా.వెంకటేష్ ఉన్నారు.

పాడి రైతులకు అవగాహన సదస్సు

నవతెలంగాణ-కల్లూరు

హెరిటేజ్ పాల సేకరణ కేంద్రంలో పాడి రైతులకు, పశు పోషణ, పాల సమృద్ధి, పాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా హైదరాబాద్ రీజనల్ హెడ్ ఏ బి నర్సింగరావు మాట్లాడుతూ రైతులకు పాల ప్రాముఖ్యతను, వాటి అభివృద్ధి గురించి వివరించారు. అదేవిధంగా అసిస్టెంట్ మేనేజర్ వి.సతీష్ రెడ్డి మాట్లాడుతూ పాడి రైతులకు హెరిటేజ్ ఫుడ్స్‌లో లోన్ సౌకర్యం కలదన్నారు. కల్లూరు ప్రొక్యూర్ మెంట్ మేనేజర్ అశోక్ మాట్లాడుతూ పాడి రైతులకుఉచిత ప్రమాద బీమాను, పశువులకు ఇన్సూరెన్స్‌ను ఇవ్వడం జరుగుతుందని, ఎవరైనా ప్రమాదానికి గురై చనిపోతే వారి కుటుంబానికి 2 లక్షల రూపాయల ప్రమాద బీమాను అందిస్తుందన్నారు. ఇతర ప్రమాదాలకు గురై హాస్పటల్లో జాయిన్ అయితే వైద్య ఖర్చులు నిమిత్తం 50 వేల రూపాయలను రైతులకు ఇస్తుందని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హొమియో వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ-కల్లూరు

పట్టణంలోని శ్రీ షిరిడి సాయి రామ ధ్యానమందిరం కమిటీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులు, సీజనల్ వ్యాధులు ఉన్నవారికి ఉచిత వైద్యం నిర్వహించి సలహాలు సూచనలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, మండలాలకు చెందిన 200మందికి పైగా వైద్య సేవలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నీలిమ, శ్రీనివాస్ నాయక్, ప్రవీణ్‌లు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొప్పురపు బలరాం, బాలాజీ, మురళి తదితరులు పాల్గొన్నారు.



సృజనాత్మకతను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్

ప్రముఖ విద్యావేత్త, కవి, ఫెమా జిల్లా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఖమ్మం

విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు, భయాన్ని తగ్గించేందుకు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని ప్రముఖ విద్యావేత్త, కవి ఫెమా జిల్లా కన్వీనర్ మువ్వా. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పట్టణ, మండల స్థాయిలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ ఖమ్మంలోని త్రివేణి స్కూల్ లో టాలెంట్ టెస్ట్ పేపర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునాతన కాలంలో విద్యార్థులు వారి మేధోశక్తిని పోటీ ప్రపంచానికి అనుగుణంగా పెంపొందించుకోవాలని, విజ్ఞాన వంతులుగా, మేధావులుగా తయ్యారవ్వాలని ఆయన తెలిపారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి, ప్రస్తుత డి.వై.యఫ్.ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం, వారి సమస్యలపై పోరాడుతూ, టాలెంట్ టెస్ట్ పెట్టడం అభినందనీయం అని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత 25 సంవత్సరాలుగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షకు ధీటుగా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని, పట్టణ, మండల స్థాయిలో మండలానికి టాప్ ఐదుగురిని ఎంపిక చేసి, జిల్లా స్థాయి టెస్ట్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో టాప్ ముగ్గురికి, అలాగే ప్రభుత్వ పాఠశాలలో రాసిన టాప్ విద్యార్థికి ఆర్థిక పారితోషకం, షీల్డ్ సర్టిఫికెట్స్ ఇస్తామని, టాలెంట్ టెస్ట్ విజయవంతం అవడానికి సహకరిస్తున్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందరికీ జిల్లా కమిటీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రివేణి స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ పగిడిపల్లి.వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పర్వీన్, ఖమ్మం నగర కన్వీనర్ తరుణ్, నాయకులు సంగీత, శ్రీలత, మౌనిక, శ్రావ్య, శరీఫా, నవ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డులోని శిరిడి సాయి మందిరం నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండోవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైరా ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఉదయ లక్ష్మి, కంటి వైద్య నిపుణులు మాధురి, పోడపాటి నాగేశ్వరావు, మిద్దె సుబ్బారావు, చెరుకూరి శ్రీనివాసరావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధనేకూల శ్రీనివాసరావుకు మదన్ లాల్ నివాళి

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీ పరిధిలోని పల్లిపడు గ్రామంలో కౌన్సిలర్ ధనేకుల వేణు తండ్రి అమరజీవి ధనేకుల శ్రీనివాసరావు దశ దిన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా మాజీ శాసనసభ్యులు బాణోత్ మదన్ లాల్ ధనేకుల శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల శ్రీనివాసరావు, మాదినేని ప్రసాద్, నల్లబోలు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్ఏ మృతి

అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళి

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని బత్తులపల్లి గ్రామానికి చెందిన వీఆర్ఏ ఎక్కిరాల వెంకటేశ్వర్లు(55) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. వీఆర్ఏ మృతి పట్ల తాసిల్దార్ బాబ్జి ప్రసాద్, ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పిటిసి కట్ట అజయ్ కుమార్, సర్పంచ్ శీలం సత్యనారాయణ రెడ్డి, ఆర్ఐలు అన్వర్ పాషా, స్టాలిన్‌తోపాటు వీఆర్ఏల సంఘ అధ్యక్షులు శ్రీనివాసరావు, నాయకులు షరీఫ్ష, హనుమంతరావు నివాళులర్పించారు. నల్ల రిబ్బన్లు ధరించి సంతాపం వ్యక్తం చేస్తూ విధుల్లో పాల్గొన్నారు.

తల్లాడలో కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర

నవతెలంగాణ-తల్లాడ

కుర్నవల్లి, కలకోడిమా, బస్వాపురం, గ్రామాలలో గురువారం టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు సంభాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్రను కొనసాగింపుగా అభియాన్య యాత్ర నిర్వహించారు. గడపగడపకు కాంగ్రెస్ సిద్ధాంతాలను తీసుకుపోతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల చార్జిషీట్ మరియు రాహుల్ గాంధీ సందేశ కరపత్రాలను ప్రజలకు అందజేసి గ్రామాల్లోని ప్రజా సమస్యలను తెలుసుకున్నట్లు సంభాని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు బైరెడ్డి మోహన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతి రెడ్డి, కల్లూరు మండల అధ్యక్షులు పెద్దబోయిన దుర్గాప్రసాద్, ఐలూరు లక్ష్మారెడ్డి, బసవపురం సర్పంచ్ మైబు వడ్డే రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలలో ప్రణయ్ కుమార్‌కి బంగారు పతకం

నవతెలంగాణ-ఖమ్మం



జనవరి 26 నుంచి 29 వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్ పట్టణంలో నిర్వహించిన 13వ జాతీయస్థాయి ఫీల్డ్ ఆర్చరీ పోటీలలో పోటీలలో మద్దిన్ని ప్రణయ్ కుమార్ అండర్ 14 కేటగిరిలో బంగారు పతకం, అండర్ 14 క్యాటగిరి టీం హైస్కోర్‌కు ఒక బంగారు పతకం, అండర్ 17 క్యాటగిరిలో ఒక రజిత పతకం సాధించారు. ఫీల్డ్ ఆర్చరీలో కాంపౌండ్ రౌండ్ లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ఖమ్మం జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తెచ్చారు. ప్రణయ్ కుమార్ ను తల్లిదండ్రులు జీవన్, శ్రీలక్ష్మిలు, స్నేహితులు, బంధువులు అభినందించారు. తన కోచ్ లు వారధి ఉదయ్ కుమార్, వారధి చెన్న కేశవ, వి.వి.సి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కామేపల్లి

మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన బి. కిషన్ కుమార్తె బి.దీపికకు రూ.2.50 లక్షల ఎల్ఓసి చెక్కును ఎమ్మెల్యే బానోత్ హరి ప్రియ హరి సింగ్ నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజా శ్రేయస్సుకే ప్రతి పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి పార్టీ అధ్యక్షులు ధన్యకుల హనుమంతరావు, సర్పంచ్ రవి, టీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు భీమా తదితరులు పాల్గొన్నారు.

వీవీపాలెం ఆరోగ్య ఉపకేంద్రంను తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ- రఘునాథపాలెం

2వ విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ వివి. పాలెం ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిస్కిప్షన్ కళ్ళద్దాలు ఎన్ని వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు... వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ స్వయంగా వివి. పాలెంలోని గుగులోతు కృష్ణ ఇంటికి వెళ్లి, వారి ఇంట్లో కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు చేసుకొని ప్రిస్కిప్షన్ కళ్ళద్దాలు పొందిన వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి జిల్లాలో మంచి స్పందన వస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి రీడింగ్ కళ్ళద్దాలు వెంటనే ఇవ్వడం జరుగుతున్నట్లు, ప్రిస్కిప్షన్ కళ్ళద్దాలు అవసరమైనవారికి సరఫరా కోసం ఇండెంట్ చేసి, వారి వారి ఇండ్ల వద్దకే అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాకు 1888 ప్రిస్కిప్షన్ కళ్ళద్దాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేరగా, ఇప్పటికే 1305 కళ్ళద్దాలు లబ్ధిదారులకు అందజేసినట్లు ఆయన అన్నారు. జనవరి 18 న ప్రారంభమయిన కంటి వెలుగు కార్యక్రమం 100 పనిదినాల పాటు కొనసాగుతుందని, 55 బృందాల ద్వారా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి డా. బి. మాలతి, వైద్యాధికారిని డా. సంధ్యారాణి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కేసీఆర్ జన్మదినం సందర్భంగా...
నేడు డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ

- రూ.5కోట్లు వ్యయంతో 94 ఇండ్లు
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ- సత్తుపల్లి



బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎంపికైన లబ్ధిదారులకు సత్తుపల్లిలో శుక్రవారం డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేయనున్నట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. పట్టణ శివారులోని జేవీఆర్ పార్కు ఎదురుగా 5కోట్ల వ్యయంతో 94 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించడం జరిగిందన్నారు. ఇటీవల కాలంలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. ఇండ్ల సముదాయంలో మిగిలివున్న మౌలిక వసతులను పూర్తిచేయడం జరిగిందన్నారు. ఉదయం 10గంటలకు డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, పంపిణీ అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సండ్ర తెలిపారు.

నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి..

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను అధికారులు సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు, రెండు పడక గదుల నిర్మాణాలు, పోడు భూములు, 58, 59, 76, 118 ప్రభుత్వ జి.ఓ. ల ప్రకారం చేయవలసిన క్రమబద్ధీకరణపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పోడు భూముల పట్టాల పంపిణీ ఫిబ్రవరి నెలాఖరు నుంచి చేపట్టాలని సీఎం కేసీఆర్ నిరయించారని, ఆ మేరకు జిల్లా స్థాయి కమిటీ వద్ద పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు త్వరగా ఆమోదించాలని సీఎస్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా జీఓ 58 ప్రకారం ఆమోదించిన దరఖాస్తుదారులు పట్టాలను స్థానిక మంత్రి, ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో పంపిణీ పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, కంటి వెలుగు ప్రిస్క్రిప్షన్ కళ్ళద్దాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. జీవో 59 కింద 301 మంది దరఖాస్తు దారులకు డిమాండ్ నోటీస్ ఇచ్చినట్లు, మిగిలిన వారికి వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు స్నేహాలత మొగిలి, ఎన్. మధుసూదన్, ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డిఆర్వో శిరీష, ఆర్డీవో లు రవీంద్రనాథ్, సూర్యనారాయణ, డిఆర్డీఓ విద్యాచందన, డిఎంఅండ్‌హెచ్ఓ డా. బి.మాలతి, డిటిడబ్ల్యూఓ కృష్ణనాయక్, ఎడ్డివోలు ప్రకాష్ రావు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మిస్ట్ 'కార్నివల్'



నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం కొత్తూరు మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం 'కార్నివల్'ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన జ్యూక్‌బాక్స్, ఫ్లాష్‌మోబ్ అలరించాయి. పోటీ ప్రపంచంలో ఎలా రాణించాలి అనే అంశంలో భాగంగా విద్యార్థులు వివిధ రకాల ఆహారపదార్థాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులకు, తోటి విద్యార్థులకు విక్రయించారు. కార్నివల్‌లో భాగంగా నిర్వహించిన వివిధ రకాల కార్యక్రమాలతో కళాశాలలో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం ప్రిన్సిపాల్ హరికృష్ణ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కళాశాల వార్షికోత్సవ వేడుకలకు మంచి స్పందన వస్తుందన్నారు. విద్యార్థులకు అనేక రకాల పోటీలు నిర్వహించామన్నారు. కళాశాలలోని ఇంజినీరింగ్, డిప్లొమా, అగ్రికల్చర్, ఫార్మసీ, డీఎడ్, బీఎడ్, ఎంబీఏ అన్ని విభాగాల విద్యార్థులు ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారన్నారు. శుక్రవారం నిర్వహించే కళాశాల 22వ వార్షికోత్సవ దినోత్సవ వేడుకకు సింగరేణి ఫినాన్స్ డైరెక్టర్ ఎన్.బలరామ్ (ఐఆర్ఎస్), మహబూబ్‌నగర్ జేపీఎన్‌సీఈ ఫౌండర్ అండ్ ఛైర్మెన్ కేఎస్ రవికుమార్ హాజరవుతారని తెలిపారు. ఈ వారం రోజులు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ముఖ్యఅతిథులచే బహుమతులు అందజేస్తామన్నారు. కార్నివల్‌లో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మెన్ కంచర్ల సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ కొత్తూరు ప్రభాకర్‌రావు, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఫార్మసి ప్రిన్సిపాల్ టి.సత్యనారాయణ, బీఎడ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్‌వీఆర్ దీక్షితులు, అగ్రికల్చరల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అజయ్‌కుమార్, అన్ని విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంజాబ్ సీఎంను కలిసిన సండ్ర



నవతెలంగాణ-సత్తుపల్లి

హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌హాలులో జరిగిన పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రెటరీ ఏ.వేణుప్రసాద్(ఐఏఎస్) దంపతుల కుమార్తె వివిధ,శ్రీకర్‌ల వివాహ వేడుకకు హాజరైన సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య వివాహానికి విచ్చేసిన పంజాబ్ సీఎం భగవంత్‌సింగ్‌మాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జనవరి 18న ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ తొలి సభకు విచ్చేసిన భగవంత్‌మాన్‌తో సండ్రకు పరిచయం ఏర్పడగా వివాహ వేడుకలో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు.

పురం భద్రమ్మకు నివాళి

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం లింగంబంజరలో ఇటీవల మృతి చెందిన పురం భద్రమ్మ సంస్మరణ కార్యక్రమానికి ఖమ్మం డీసీసీబీ చైర్మన్ కూరకుల నాగభూషణం హజరైనారు. భద్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. భద్రమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ వెంట వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుమ్మ రోశయ్య, సొసైటీ డైరెక్టర్ దేగల ఉపేందర్, పురం అంజన్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రఘు, నాయకులు కల్తి అరుణ్‌కుమార్, దేగల సైదులు తదితరులు ఉన్నారు.

అటవీ హక్కుల చట్టానికి కేంద్రం తూట్లు

నవతెలంగాణ-కారేపల్లి

అటవీ సంరక్షణ నియమావళి పేరుతో పోరాడి సాధించిన అటవీ హక్కును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తూట్లు పొడవాలని చేస్తుందని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్ విమర్శించారు. కారేపల్లి మండలం పేరుపల్లిలో పోడు రైతుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈసమావేశంలో వై.ప్రకాశ్ మాట్లాడుతూ నక్సల్‌బరి ఉద్యమం, గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాల ఫలితంగా సాధించుకున్న 1/70, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టాలను సాధించుకోవటం జరిగిందన్నారు. పోరాడి సాధించిన చట్టాలను తూట్లు పొడిచి కార్పొరేట్లకు అడవులను కట్టబెట్టాలని చూస్తుందని విమర్శించారు.

గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి

నవతెలంగాణ-కారేపల్లి

గ్రామీణ ప్రాంతంలో అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తున్న గ్రామీణ వైద్యులు గుర్తింపుకు నోచుకోవటం లేదని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కారేపల్లిలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతారపు వెంకటాచారి తో కలిసి గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పారామెడికల్ బోర్డు ద్వారా 429 జీవోను విడుదల చేసి గ్రామీణ వైద్యులలో కొందరికి శిక్షణ ఇప్పించారన్నారు. తర్వాత గ్రామీణ వైద్యులకు శిక్షణ గుర్తింపు నివ్వటంలో ప్రభుత్వ పెద్దలు చిన్నచూపు చూస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం హామీ ఇచ్చారని, అవి అమలుకు నోచుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 26న ఖమ్మం జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా మహాసభ కృష్ణ పంక్షన్ హాల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

కారును అడ్డగించి రూ.21లక్షలు చోరీ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

గుర్తు తెలియని వ్యక్తులు ఓ చిట్ ఫండ్స్ చైర్మన్ కారును అడ్డగించి రూ.21 లక్షలు నగదు, నాలుగు తులాల బంగారం చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని మద్దులపల్లి వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండలో ఓ చిట్‌ఫండ్ కంపెనీ చైర్మన్ ఉన్న శ్రీనివాసరెడ్డి ఖమ్మంరూరల్ మండలంలోని టీఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్నాడు.ఈనెల 15వ తేదీ రాత్రి తన కుమారుడు, ముగ్గురు స్నేహితులతో కలిసి మొత్తం ఐదుగురు కారులో హైదరాబాద్ బయలుదేరారు. మండలంలోని మద్దులపల్లి దాటగానే ఓ ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి కారును అడ్డగించి ఘర్షణపడ్డారు. వెంటనే ఓ కారులో మరో ఆరుగురు వ్యక్తులు వచ్చి శ్రీనివాసరెడ్డి వారి స్నేహితులందరిని బెదిరించి వారి వద్ద రూ.21,57,700లు నగదుతో ఉన్న బ్యాగు, నాలుగు తులాల బంగారం చోరీచేసి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అమరజీవి మునిగంటి కృష్ణ ఆశయ సాధనకు కృషి చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మండలంలోని యం.వెంకటాయపాలెం గ్రామంలో అమరజీవి మునిగంటి కృష్ణ ప్రథమ వర్ధంతి సభ చావ నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా మునిగంటి కృష్ణ చిత్రపటానికి సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు యడ్లపల్లి వెంకటరామయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం ఖమ్మంరూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ మాట్లాడుతూ కృష్ణ సిపిఎంలో చురుకైన పాత్ర పోషిస్తూ గ్రామంలో పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన గొప్ప నాయకుడని అన్నారు. కృష్ణ చనిపోవడం పార్టీకి తీవ్ర నష్టమని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ కుమారుడు సాయి, కుటుంబ సభ్యులు, సిపిఎం సీనియర్ నాయకులు నాగండ్ల అచ్యుతరావు, టిడిపి మండల నాయకులు మునిగంటి నరసింహారావు, సిపిఎం నాయకులు నాగండ్ల కృష్ణప్రసాద్, మునిగంటి వెంకటేశ్వర్లు, కూసు సంజీవరెడ్డి, రెంటాల నాగేశ్వరరావు, జక్కంపూడి నాగేశ్వరరావు, తుపాకుల లచ్చయ్య, సిరిశివడ మల్లికార్జున్, బాలిన నాగేశ్వరరావు నివాళులర్పించారు.

డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పఠాన్ రోషిని ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం





డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పఠాన్ రోషిని ఖాన్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా సత్తెనపల్లి నరేష్, శీలం వీరబాబులను ఎన్నుకున్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలు ఈనెల 14, 15 తేదీల్లో నల్లగొండ పట్టణంలో జరిగాయి. ఈ సమావేశాలలో కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి మండలానికి చెందిన పటాన్ రోషిని ఖాన్ గత మూడు సంవత్సరాలుగా డీవైఎఫ్ఐలో బాగా పనిచేస్తున్నారని, సత్తుపల్లి రూరల్ మండల కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యురాలుగా, యంగ్ ఉమెన్ జిల్లా కోకన్వీనర్‌గా, ఇప్పుడు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. తల్లాడకు చెందిన సత్తెనపల్లి నరేష్, ఖమ్మం త్రీ టౌన్ శీలం వీరబాబులు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నిక కావడం కూడా జిల్లా ఉద్యమానికి మంచిదని, మరింత ఉద్యమాన్ని జిల్లాలో పెంచేందుకు ఈ ఎన్నిక ఉపయోగపడుతుందని తెలిపారు. ముగ్గురు ఎన్నిక పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

జాతరకు కోటిలింగాల ముస్తాబు

- 18 నుండి మూడు రోజులు జాతర
- భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం

: ఆలయ చైర్మన్

నవతెలంగాణ-కారేపల్లి



ఇల్లందు - సింగరేణి ప్రాంతంలో కోటమైసమ్మ తర్వాత అతిపెద్ద జాతర కోటిలింగాల జాతర. ప్రతి ఏడాది శివరాత్రిరోజు ప్రారంభమై మూడు రోజులు నిరాటంకం జరిగే ఈ జాతరకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సింగరేణి మండలం పోలంపల్లి సమీపంలోని కోటిలింగాల్లో శివరాత్రి సందర్భంగా ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో ఈనెల 18 నుండి మూడు రోజులు జాతర జరుగనుంది. ప్రతి ఏడాది కోటిలింగాలలో జరుగు జాతరకు చుట్టుపక్కల జిల్లాల నుండి వేలాది మంది భక్తుల రాకతో ఆ ప్రాంతం శివనామస్మరణలతో మారుమోగిపోతుంది. కోటిలింగాల ఏరు వద్ద కాకతీయుల కాలం నుండి శివుడు స్వయంభుడుగా వెలిశారు. ఈ ప్రాంతంలో జలం భూమి నుండి పైకి ఉబికి వస్తుండటం ఆ నీటి కోసం భక్తులు పోటీపడితుంటారు. ఆలయ ప్రాంగణంలో గజంతో కూడిన శివలింగం, 108 శివలింగాలు, నాగేంద్రుడు, సాలేపురుగు, భక్తకన్నప్ప శివలింగానికి పూజలు చేస్తున్న వంటి ఆకృతులు దాతల సహకారంతో ప్రతిష్టించి ఆలయ విశిష్టతను ఇనుమడింపజేశారు.

ఆదివాసి ఆధ్వర్యంలో జాతర నిర్వహణ

కోటిలింగాల జాతరను పోలంపల్లి ప్రాంతానికి చెందిన ఆదివాసి గిరిజనులు నిర్వహించటం అనవాయితీ. ఆదివాసిలైన ఆలెం కుటుంబీకుల స్థలంలో ఈ దేవాలయం ఉండటంతో ఆ కుటుంబీకులు ఆధ్వర్యంలో గ్రామంలోని ఆదివాసీలు కమిటీ సభ్యులుగా ఉండి జాతర ఏర్పాట్లు చూస్తుంటారు. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు ఆలయ కమిటీ భక్తులు క్యూలో నిల్చోవటానికి చలువ పందిళ్ల వేశారు. భక్తుల స్నానాలకు ఏరు నుండి నీటి సరఫరాకు మోటర్లకు బిగించారు. లైట్లను ఏర్పాటు చేశారు.

జాతరను ప్రభుత్వ శాఖలు పట్టించుకునేనా?

ఆదివాసీల ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగే కోటిలింగాల జాతరను ప్రభుత్వ శాఖలు పట్టించుకోక పోవటం విచారకరం. జాతరకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టే ప్రభుత్వం గిరిజనుల ఆధ్వర్యంలో నడిచే జాతర పట్ల చిన్నచూపుచూపు ఉందని విమర్శ ఉంది. ఇల్లందు ఆర్‌అండ్‌బి రోడ్ నుండి కోటిలింగాలకు వచ్చే రహదారి గుంతలమయ్యంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఆ రహదారి మీదగానే మహబూబాబాద్, బయ్యారం, గార్ల, ఇల్లందు,టేకులపల్లి మండలాల జనం తరలివస్తుంటారు. దానిని బాగు చేయాలన్న తపన ప్రభుత్వ శాఖలకు రాలేదు. కనీసం జాతరకు వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలైన తాగునీరు. స్నాన ఘట్టాల ఏర్పాటు లేక భక్తులు ఇబ్బందులతోనే దేవుడి దర్శించుకునే స్థితి ఇక్కడ కనిపిస్తుంది. జాతరలు కేవలం పోలీసులు శాఖ, వైద్య శాఖ తప్ప ఇతర శాఖలు పట్టనట్లు వ్యవహరిస్తుంటాయని విమర్శ ఉంది. ఈసారి వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి జాతరలో సౌకర్యాల ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సింగరేణి కాలరీస్ సంస్థ విద్యుత్ లైట్లు, త్రాగునీటి సౌకర్యాల కల్పించాలని కోరారు. అగ్నిమాపక కేంద్రం, వైద్య శాఖ సిబ్బంది జాతర 3 రోజులు నిరంతరం సేవలు అందించాలని కోరారు. ఆలయ సమీపంలో కోటిలింగాల వాగు ఉండటంతో వాగు కట్టపై నుండి ప్రయాణించే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వాగు వద్ద గజఈతగాళ్లను ఏర్పాటు చేయాలని, కట్ట అలుగుపై ఉన్న ఇనుప నిచ్చెనను మరమ్మత్తులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈసారి అయిన భక్తులు ఇబ్బందులు తొలగిపోతాయని ఆశిద్దాం.

భక్తులకు కనీస వసతులు కల్పిస్తున్నాం

:ఆలయ చైర్మన్ ఆలెం వెంకటేశ్వర్లు



కోటిలింగాల జాతరకు వచ్చే భక్తులకుకనీస వసతులు కల్పిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ ఆలెం వెంకటేశ్వర్లు తెలిపారు. తాగునీటి అవసరాలు తీర్చటానికి మంచినీటి ట్యాపులు, స్నానాలకు కోటిలింగాల ఏరు నుండి మోటర్లు పెట్టినాము. ఇల్లందు మున్సిపాలిటీ వారి సహకారంతో జాతర ప్రాంతంలో లైట్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఆలయం సమీపంలోని బావుల వద్ద మోటర్ల పెట్టి భక్తుల స్నానాలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నామన్నారు.

వృత్తి పన్ను వసూలు చేయడం దుర్మార్గం

- ఎస్‌సీకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు



నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల నుండి నెలకు రూ.150లు వృత్తి పన్ను వసూలు చేయడం దుర్మార్గమని, తక్షణం వృత్తి పన్ను వసూలు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం (ఎస్‌సికెఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. సింగరేణి వృత్తి పన్నుగా వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చింది. గత రెండు సంవత్సరాలకు సంబంధించిన వృత్తి పన్నును కూడా చెల్లించాలని కార్మికుల వేతనాల నుండి వాటిని కట్ చేస్తామని కాంట్రాక్టర్లు కార్మికులకు చెప్పడం సరికాదన్నారు.

అసలే వేతనాలు పెరగక, మరోపక్క నిత్యావసర సరుకుల ధరలు, డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగి చాలీచాలని వేతనాలతో తమ కుటుంబాలను గడుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులపై వృత్తి పన్ను పేరుతో అదనపు భారాన్ని వేయటం సమంజసం కాదన్నారు. గత ఐదు సంవత్సరాలుగా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ చూపకపోగా పన్నుల పేరుతో భారాలు వేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని వృత్తి పన్నును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ : తహసీల్దార్

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదేశానుసారం శుక్రవారం ఆయన చేతులు మీదుగా కల్యాణ లక్ష్మి లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ లూదర్ విల్సన్ గురువారం తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమంలో నిర్వహించబడుతుందని తెలియజేశారు. 26 మంది లబ్దిదారులకు చెక్కులు అందజేస్తామని తెలిపారు.

సాయి మందిరంలో అన్నదానం



నవతెలంగాణ-భద్రాచలం

జూనియర్ కళాశాల సెంటర్లోని సాయిబాబా వారి మందిరంలో గురువారం ఉదయం బాబాకు అభిషేకం అర్చనలు జరిపారు. స్వర్ణ ఆభరణాలు ధరింప చేసి హారతి పాడారు. భద్రాచల వాస్తవ్యులు నాళం పట్టాభి రామయ్య మంజుల దంపతులు గురువారం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులు కొమ్మనాపల్లి ఆదినారాయణ, కోశాధికారి కుంచాల రమేష్, అన్నదానం దాతను శాలువాతో సత్కరించి బాబా వారి మెమెంటూను అందచేశారు. అన్నదానంలో 800 మంది భక్తులు పాల్గొన్నారు. వృద్ధాశ్రమం వృద్ధులకు భోజనం బాబా ఆలయం నుండి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక

- మహిళా చెస్ చాంపియన్ షిప్ క్రీడాకారులు రాణించాలి
- జిల్లా యువజనుల, క్రీడల అధికారి సీతారామ్



నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం కొత్తగూడెం సింగరేణి పాఠశాలలో మహిళా చెస్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించారు. మంచి ప్రతిభ కనబరిచి క్రీడాకారులకు జిల్లా యువజనుల, క్రీడల అధికారి టి.సీతారామ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన వారు ఎల్‌బి స్టేడియం, హైద్రాబాద్‌లో జరిగే మహిళా చెస్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. మరింత ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తేవాలని కోరారు. జరిగిన పోటీలలో 30 టీములు పాల్గొన్నాయి. మొదటి బహుమతి పి.అద్వైత, (న్యూపాల్వంచ), రెండవ బహుమతి ఎండి.సుమహా (పాల్వంచ) గెలుచుకున్నారు. బి.తిరుమలరావు, పులి లక్ష్మయ్య, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.సాంబశివరావు, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి స్టెల్లా పాల్గొన్నారు.

ప్రజల నడ్డి విరిసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ



నవతెలంగాణ పాల్వంచ

నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి ప్రజల నడ్డి విరిసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తరిమికొట్టాలని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా టీపీసీసీ ఆదేశాల మేరకు చేపట్టిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా ఎడవల్లి గురువారం పాల్వంచ మండలంలోని యానంబైల్, కిన్నెరసాని గ్రామాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతాన్ని అడ్డుపెట్టుకుని అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను, ప్రాంతాన్ని అడ్డుపెట్టుకుని అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను సవివరంగా ఆయా గ్రామాల్లోని స్థానిక ప్రజలకు వివరించారు. అదే విధంగా రాబోయే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం ద్వారా మాత్రమే దేశ వ్యాప్తంగా సంక్షేమ పాలన సాధ్యమవుతుందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మండల ఓబీసీ అధ్యక్షులు కట్టా గుండా శ్రీనివాసరావు, బుడగం మోహన్ రావు, బుడగం కిరణ్, పాల్వంచ పట్టణ ఓబీసీ అధ్యక్షులు చారీ, వీరయ్య చౌదరి భూక్యా రాములు నాయక్, చంద్రగిరి సత్యనారాయణ, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

- సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మా



నవతెలంగాణ-సుజాతనగర్

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగులోత్ ధర్మా అన్నారు. గురువారం సుజాతనగర్ మండలం, మంగపేటలో మహాసభ బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిర్యాలగూడలో మార్చి 1,2,3 తేదీలలో జరుగనున్న రాష్ట్ర మహాసభలను, మంగపేటలో గ్రామంలో మార్చి 26న జరుగనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ధర్మా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జగన్, జిల్లా నాయకులు భీమారావు, మండల నాయకులు హతిరామ్, రామ, కిషన్, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతివ్యక్తి ఆదర్శంగా జీవించేందుకే సంస్కృతి సాంప్రదాయాలు : కూనంనేని



నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రతివ్యక్తి ఆదర్శంగా జీవించేందుకు మన పూర్వికులు నాటి నుంచి వస్తున్న ఆచార, వ్యవహారాలు, సంస్కృతి, సాంప్రదాయాలు దోహదపడతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మిదేవిపల్లి మండల పరిధిలోని తెలగరామవరం గ్రామంలో శ్రీ సీతారామ, ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్టా మహోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ విభిన్న సంస్కృతులకు గ్రామాలు నిలయాలుగా నిలుస్తున్నాయని, నేర్పిన సంస్కృతి, సాంప్రదాయాలను ఆచరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు వై.శ్రీనివాసరెడ్డి, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న ఓసి 2 పవర్ సెక్షన్ ఉద్యోగులు



నవతెలంగాణ-మణుగూరు

ఓసి2 పవర్ సెక్షన్ ఉద్యోగులు మానవత్వాన్ని చాటుకున్నారు. గురువారం పీకే ఓసి ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో పొరుగు సేవల ఉద్యోగిగా పనిచేస్తూ వారం రోజుల క్రితం మృతి చెందిన స్థానిక ముత్యాలమ్మ నగర్‌కి చెందిన తెన్నేటి రవిచంద్ర కుటుంబానికి ఓసీ 2 పవర్ సెక్షన్ ఉద్యోగులు ఆయన నివాసంలో భార్య గాయత్రిని ఇద్దరు కుమార్తెలను పరామర్శించారు. అనంతరం రూ.15100లను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పవర్ సెక్షన్ నాయకులు చిట్టూరి రవిబాబు మాట్లాడుతూ ఓసి 2 సొసైటీలో దీర్ఘకాలికంగా పొరుగు సేవల ఉద్యోగిగా పనిచేయటమే కాకుండా సొసైటీ నిబంధనవళి పై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. రవి చంద్ర చనిపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామని పవర్ సెక్షన్ ఉద్యోగులు భరోసా ఇచ్చారు. అనంతరం రవి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పవర్ సెక్షన్ ఉద్యోగులు వనమా రామారావు, మార్క్స్ ఆంతోటీ, సుధాకర్, చింతల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలుతోంది...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మళ్లీ రవాణా

- ఇక్కడి నుంచి కశ్మీర్ వరకు సరఫరా
- పలుమార్లు పట్టుబడినా ఆగని అక్రమం
- కరోనా నాటి నుంచి ఊపందుకున్న స్మగ్లింగ్
- మత్తులో యువత...విపరీత చర్యలు



ఆదివారం కొత్తగూడెంలో పట్టుబడిన గంజాయి



ఖమ్మంలో...

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మళ్లీ గంజాయి దందా ఊపందుకుంది. కోవిడ్-19 వ్యాప్తి ప్రారంభమైన నాటి నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాదట్టమైన అటవీప్రాంతంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు, ఒడిశాలోని మల్కన్‌గిరి అడవుల్లో యథేచ్ఛగా గంజాయి సాగవుతోంది. పలుమార్లు పోలీసులు గంజాయి సాగు ప్రదేశాలను గుర్తించి మొక్కలను ధ్వంసం చేసిన సందర్భాలున్నాయి. అలాగే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి పెద్దమొత్తంలో గంజాయి రవాణా అవుతోంది. ఇలా రవాణా అవుతున్న గంజాయి అధిక మొత్తంలో పట్టుబడుతోంది. లారీలు మొదలు ద్విచక్ర వాహనాల వరకూ పలుమార్లు పోలీసులకు పట్టుబడటంతో సీజ్ చేశారు.

గంజాయి 'వనం'...మైదానం

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి గుప్పుమంటోంది. దాదాపు రెండేళ్ల కరోనా కాలంలో అత్యధిక గంజాయి స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. గతేడాది నగానికి తగ్గినా...అప్పుడప్పుడు భారీగా నిల్వలు పట్టుబడుతున్నాయి. ఆదివారం రూ.97.60 లక్షల రూపాయల విలువైన గంజాయి కొత్తగూడెంలో పట్టుబడింది. ఇద్దరు స్మగ్లర్లతో పాటు రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నవంబర్ 2022లో రూ.36 లక్షల విలువైన గంజాయి పట్టుబడింది. మరుసటి రోజు సోమవారం ఖమ్మం టూటౌన్ పోలీసులు సైతం వ్యాన్‌లో తరలిస్తున్న రూ.40లక్షల విలువైన గంజాయిని పట్టుకున్నారు. 2021లో ఖమ్మం జిల్లాలో 3,639 కేజీల గంజాయిని పట్టుకోగా 2022లో 742 కేజీలు మాత్రమే పట్టుబడింది. ఈ రెండేళ్లలో 6,589 కేజీల గంజాయిని ధ్వంసం చేశారు. భద్రాద్రిలో 2019లో రూ.6.56 కోట్ల విలువ చేసే 3,792 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 35 కేసుల్లో 117 మందిని అదుపులోకి తీసుకున్నారు. 2020లో రూ.13.66 కోట్ల విలువ చేసే 9,126 కేజీలు స్వాధీనం చేసుకున్నారు. 69 కేసులు నమోదు చేసి 213 మందిని అదుపులోకి తీసుకున్నారు. 2021లో రూ.18.54 కోట్ల విలువైన 12,365 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 50 కేసులు నమోదు చేసి 115 మందిని అరెస్టు చేశారు.

గంజాయి స్మగ్లింగే పనిగా...

గంజాయి స్మగ్లింగ్‌తో ఆదాయం భారీగా వస్తుండటంతో పలువురు ఇతర వ్యాపారాలను వదిలి ఈ పనిలోనే ఉంటున్నారు. కొందరు స్మగ్లర్లు జిల్లా నుంచి కశ్మీర్ వరకూ గంజాయి సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం మీదుగా.. హైదరాబాద్ తరలిస్తున్నారు. అక్కడి నుంచి ముంబయి, ఢిల్లీ, నాగపూర్, కశ్మీర్ తదితర ప్రాంతాలకు చేరవేస్తున్నారు.

రిటైల్ అమ్మకాలు...విపరీత చర్యలు

గంజాయి అక్రమ రవాణాయే అనుకుంటే...రిటైల్ విక్రయాలు సైతం జోరుగా సాగుతున్నాయి. యువతే లక్ష్యంగా స్మగ్లర్లు స్థానికంగానూ మార్కెట్ సృష్టించుకున్నారు. భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు పారిశ్రామిక ప్రాంతాలతో పాటు ఖమ్మంలో రిటైల్‌గా గంజాయి విక్రయాలు సాగించేందుకు కొన్ని ముఠాలు సైతం ఏర్పడ్డాయి. రిటైల్‌గా కొనుగోలు చేసిన యువత గంజాయి సేవిస్తూ విపరీత చర్యలకు పాల్పడుతున్నారు. గతంలో ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి సమీపంలో ఓ యువకుడు గంజాయి మత్తులో తల్లి చెవిని కొరికి తిన్నాడు. అన్నదమ్ములు ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకున్న ఉదంతాలున్నాయి. తాజాగా ఇదే మండలం జలగంనగర్ ప్రాంతానికి చెందిన యువకులు మత్తులో ఖమ్మం మయూరిసెంటర్లో గొడవపడ్డారు. వీరిలో ఒకరిపై మరొకరు పెట్రోల్ పోసి నిప్పుపెట్టడం సంచలనంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు రియాజ్ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఇంకా వెలుగులోకి రాని అనేక ఉదంతాలు చోటుచేసుకోవడం గమనార్హం.

గంజాయికి అడ్డుకట్ట వేస్తున్నాం...



గంజాయి రవాణాను నియంత్రిస్తున్నాం. ఏటేటా తగ్గుముఖం పడుతుంది. గంజాయి మత్తులో యువత దుశ్చర్యలకు పాల్పడుతోంది. అటువంటి వారికి కౌన్సెలింగ్ ఇప్పించడం...గంజాయి సేవించడం వల్ల చోటుచేసుకునే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతాం.

విష్ణు ఎస్ వారియర్, పోలీసు కమిషనర్, ఖమ్మం

రామాలయం నూతన ఈవోగా రమాదేవి బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం రామాలయం నూతన ఈవోగా రమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయం వద్దకు వచ్చిన నూతన ఈవోకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలోని సీతారాముల ఎదుట ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఉపాలయంలో వేద ఆశీర్వచన అందుకున్నారు. ఆలయ విశిష్టతను ఈ సందర్భంగా అర్చక స్వాములు నూతన ఈవోకు తెలియజేశారు.

యాగశాల నిర్మాణానికి పూజలు

మార్చి 31న జరగనున్న పుష్కర పట్టాభిషేకం మహోత్సవంకు సంబంధించి హోమ తాత్కాలిక యాగశాల నిర్మాణానికి గురువారం అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద గల గోశాల కింద మాడవీధుల వద్ద యాగశాల నిర్మాణానికి అర్చకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నూతన ఆలయ ఈవో ఎల్.రమాదేవి, మాజీ ఈవో శివాజీ, ఏఈఓ శ్రావణ్ కుమార్, ఈఈ రవీందర్, ఆలయ స్థానాచార్యులు స్థల సాయి, ఆలయ ప్రధాన అర్చకులు సీతారామానుజాచార్యులు, ఉద్యోగులు సిబ్బంది, పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో ఇంటి క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేస్తాం

- సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్
- కంటి వెలుగు, పోడు సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు పై కలెక్టర్‌ను అభినందించిన సీఎస్



నవతెలంగాణ-పాల్వంచ

జిల్లాలో జీవో నెం 76 ప్రకారం 12948 దరఖాస్తులు ఇంటి స్థలాలు క్రమబద్ధీకరణకు విచారణ ప్రక్రియ పూర్తి చేశామని, మిగిలిన 83 దరఖాస్తులు నాలుగు రోజుల్లో పూర్తి ప్రక్రియను పూర్తి చేస్తామని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. హైదరాబాద్ నుండి గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కంటివెలుగు, జీఓ నెం.76, 58, 59, 118, తెలంగాణకు హరితహారం, పోడు పట్టాలు, రెండు పడక గదుల ఇండ్లు తదితర అంశాలపై కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 93 గ్రామ పంచాయతీలు, 36 వార్డుల్లో కంటివెలుగు క్యాంపులు నిర్వహించామని చెప్పారు. ఇప్పటి వరకు 1,23,499 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 34521 మందికి రీడింగ్ కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రిస్కిప్షన్ అద్దాలు అవసరమైన వారి వివరాలు పోర్టల్‌లో అప్లోడ్ చేశామని ఆయన తెలిపారు. రెండు పడక గదులు ఇళ్ల లబ్దిదారుల వివరాలను పోర్టల్‌లో అప్లోడ్ చేసేందుకు క్షేత్రస్థాయిలో విచారణ ప్రక్రియ నిర్వహణకు టీములు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వేసవిలో మొక్కలు సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. రానున్న తెలంగాణకు హరితహారంలో మొక్కలు నాటేందుకు అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీలలో మొక్కలు పెంపకానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో విచారణ ప్రక్రియ పూర్తయిన పోడు దారులకు పట్టాలు జారీ చేసేందుకు 44 వేలు పాసు పుస్తకాలు ప్రింటింగ్ ప్రక్రియ జరుగుతున్నదని చెప్పారు. ప్రింటింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో కంటివెలుగు కార్యక్రమాలు, పోడు సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అభినందించారు. కంటి వెలుగు కార్యక్రమం బాగా జరుగుతున్నదని, ఇదే స్ఫూర్తితో నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం నిర్వహించి కంటి సమస్యలకు పరిష్కారం లభించే విధంగా కృషి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇల్లందు అటవీశాఖ అధికారి నీరజ కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, డీఆర్ అశోకచక్రవర్తి, కొత్తగూడెం ఆర్డీఓ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేకపోతే కఠిన చర్యలు

- ప్రసూతి వార్డును పర్యవేక్షించిన డీసీహెచ్ఎస్



నవతెలంగాణ-చర్ల

ప్రసూతి వార్డు నిర్మాణ పనులు నాణ్యంగా లేకపోతే కఠిన చర్యలు చేపడతానని భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా డీసీహెచ్ఎస్ రవికుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన ప్రసూతి వార్డు పనులను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. సుమారు కోటి 40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ప్రసూతి వార్డు పనులు నాణ్యంగా ఉండాలని ఎక్కడ అవకతవకలు జరగకుండా చూడాలని ఆయన ఇంజనీరింగ్ శాఖ అధికారులకు ఆదేశించారు.

గిరిజన ప్రాంతాలలో నిరుపేదలకు ఎంతో అవసరమైన వైద్య సదుపాయం సక్రమంగా అందించడానికి వసతులన్నీ సవ్యంగా ఉండే విధంగా చూసుకోవాలని స్థానిక ఇద్దరు డాక్టర్లకు ఆయన సూచించారు. ఇటీవలే మరమ్మతులు పూర్తిచేసిన సీమాంగ్ సెంటర్‌ను ఆయన పరిశీలించి గుత్తేదారుకు కొన్ని సూచనలు చేయడం జరిగింది. పర్యవేక్షణలో ఈయనతో పాటు డాక్టర్ పెద్దాడ కాంత్, పాల్వంచ జగన్, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

భద్రాచలంలో జియో ఫైబర్ నెట్‌వర్క్ ప్రారంభం



నవతెలంగాణ-భద్రాచలం టౌన్

భద్రాచలం పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులో జియో ఫైబర్ నెట్వర్క్ సెంటర్‌ని మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోట దేవదానం చేసిన విధిగా ప్రారంభించారు. మొదటి జియో ఫైబర్ నెట్వర్క్ కనెక్షన్‌ని ప్రముఖ న్యాయవాది జయరాజ్‌కి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలంలో జియో ఫైబర్ నెట్వర్క్ ప్రారంభించడం ఎంతో శుభ పరిణామం అని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన టెక్నాలజీని అందుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఏజెన్సీ కేంద్రంలో నెట్వర్క్ సమస్యలు తెల ఎత్తకుండా ఉండేందుకు జియో వారు చేసిన కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, ముసునూరి సునీల్ కుమార్‌తో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకుడినే కాదు.. ప్రజాసేవకుడిని కూడా

- రూ.1.56 కోట్లతో మంగపేట పీహెచ్సీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ
- ఎమ్మెల్యే మెచ్చా



నవతెలంగాణ-ములకలపల్లి

రాజకీయ నాయకుడినే కాదు...ప్రజాసేవకుడిని కూడా అని అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని మంగపేట పీహెచ్సీ వద్ద రూ.1.50కోట్లతో నిర్మించతలపెట్టిన నూతన భవన నిర్మాణానికి ఆయన లాంఛనంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెచ్చా మాట్లాడుతూ మంగపేటలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచనతో ప్రత్యేకం చొరవ తీసుకుని రూ.1.50కోట్లు నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మంగపేట వైద్యశాలలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను గర్భిణులకు పంపిణీ చేసి తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే గొప్ప మనస్సుతో సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని అమలు చేశారన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే మెచ్చా లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పంపిణీ చేశారు. అదేవిధంగా జగన్నాధపురంలో రామాలయం దర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, ఎంపీటీసీ మెహరామణి, తులసి, ప్రధాన కార్యదర్శి శెనగపాటి అంజి, సర్పంచ్లు గడ్డం భవానీ, కారం సుధీర్, వాడే లక్ష్మి, సున్నం సుధాకర్, గొల్ల పెంటయ్య, కేసరి శ్రీను, సున్నం సుశీల, నాయకులు తాండ్ర రాంబాబు, నందమూరి సురేష్, కొండవీటి రాజారావు, సత్యనారాయణ, రమేష్, గడ్డం వతానిల్, అనుముల నర్సింహారావు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రుగొండ : బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని బిఆర్ఎస్ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని అశ్వారావుపేట శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావును స్పష్టం చేశారు. గురువారం శాసనసభ్యులు మండలంలో పర్యటించారు. ముందుగా మద్దుకూరు గ్రామంలో కాంపాటి మల్లయ్య రంజిత దంపతుల కుమార్తె లిఖిత, కుమారుడు లక్ష్మణ్, ఓణీలు పంచ కట్టు కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ చంద్రుగొండ టౌన్ ప్రెసిడెంట్ సూర వెంకటేశ్వర్లు తండ్రి సూర కృష్ణయ్య (75) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కృష్ణయ్యకు నివాళులర్పించారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన జడ్పీటీసీ కొనకండ్ల వెంకటరెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు సారేపల్లి శేఖర్‌ను ఓదార్చారు. ఆయన సతీమణి సారెపల్లి నాగశిరోమణి (53) మృతి పట్ల విషాదం వ్యక్తం చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ధారా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఉప్పతల ఏడుకొండలు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రసూల్, జిల్లా నాయకులు మేడా మోహన్ రావు, గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలి

- ఎమ్మెల్యే వనమా

నవతెలంగాణ-పాల్వంచ

పాల్వంచ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మపేట సెంటర్, శ్రీనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐ-జల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం వనమా ప్రారంభించారు. ఈ సందర్భంగా వనమా నిర్వాహకులతో మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ నుండి నీటిని ఫిల్టర్ చేసి నాణ్యమైన నీటిని తక్కువ ధరలకు ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, బీఆర్ఎస్ అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్, ఐ-జల్ జిల్లా ఇన్చార్జి ఎస్.వి.ఆర్.కె.ఆచార్యులు, కొత్తపల్లి సోమయ్య, కాల్వ ప్రకాశరావు, బొల్లెపోగు రవి, నందిగామ జయరాజు, బొల్లెపోకు వంశీ, దండోరా శ్రీను, కత్తి శ్రీను, వెంకటేశ్వర్లు, మల్లేష్ నాయుడు, కటుకూరి వెంకటేశ్వర్లు, రెహమాన్, దారా చిరంజీవి, ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.

విధులలో నిమగ్నమై పోలీసులు ఆరోగ్యాలను విస్మరిస్తున్నారు

- తమ ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి
- ఎస్పీ వినీత్.జి

నవతెలంగాణ-కొత్తగూడెం

విధి నిర్వహణలో నిమగ్నమై పోలీసులు తమ ఆరోగ్యాలను విస్మరిస్తున్నారని, పోలీసులు, అధికారులు తమ ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ వినీత్.జి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ హేమచంద్రాపురంలో పోలీసుల కోసం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రెండు రోజుల పాటు జిల్లాలోని పోలీసులందరికి వైద్య పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాటు చేసిన



ఈ శిబిరాన్ని ప్రారభించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులలో నిమగ్నమై ఉంటున్న పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా వారికోసం ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా పోలీసు శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, ఏఆర్ డిఎస్పీ విజయ్ బాబు, భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, కొత్తగూడెం డిఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ వెంకటేష్, ఇల్లందు డిఎస్పీ రమణ మూర్తి, సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి : ఎంపీపీ

- మండలంలోనే మిర్చి, పత్తి, ధాన్యం, కొనుగోలుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నాం
- కొత్తగూడెం ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ భుక్యా రాంబాబు

నవతెలంగాణ-చంద్రుగొండ

వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఎంపీపీ భానోత్ పార్వతి ఆదేశించారు. గురువారం చంద్రుగొండ మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరేలా అధికారులందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ముఖ్యంగా త్రీ పేస్ అంతరాయంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దాల్వ పంటలు వేయడంతో నీళ్ల అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే తిప్పనపల్లి గ్రామంలో రోడ్డు కిరువైపులా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని ఆదేశించారు. కొత్తగూడెం ఏఎంసి మార్కెట్ కమిటీ చైర్మన్ భుక్యా రాంబాబు మాట్లాడుతూ...వచ్చే యేడాది నుంచి చంద్రుగొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం, పత్తి, మిర్చి, కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.అన్నపూర్ణ, జిల్లా కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రసూల్, వైస్ ఎంపీపీ నరుకుళ్ళ సత్యనారాయణ, ఎంపీటీసీలు లంక విజయలక్ష్మి, భూక్యారాజి, సంగొండి వెంకట కుమారి, సర్పంచులు బానోత్ రణ్య, వాసం లలిత శివజ్యోతి, కీశరి శాంతమ్మ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు రాణి, శకుంతల, మండల వైద్యాధికారిని డాక్టర్ కనకం తనూజ, మండల విద్యాశాఖ అధికారి సత్తెనపల్లి సత్యనారాయణ, ఏవో వినయ్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ శ్రీనివాసరావు, సీఈఓ లంక నరసింహారావు, ఐకెపి, ఆర్డబ్ల్యూఎస్, ఎక్సైంజ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-భద్రాచలం

2023-24 విద్యా సంవత్సరముకు గాను పూర్వ ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహించ బడుతున్న రెండు మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్ కిన్నెరసాని (బాలురు), కచేనపల్లి (బాలికలు) వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయినపల్లి హైదరాబాదు నందు, ఐదవ తరగతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో ప్రవేశాలకు గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించడం జరుగుతుందని, ఐటీడీ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన విద్యార్థిని, విద్యార్థులకు మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసాని పాల్వంచనందు, ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు గిరిజన ఆశ్రమ హై స్కూల్ ఉసిరికాయలపల్లి ఖమ్మం జిల్లా నందు, ఈ నెల 25 నుండి 28 తేదీలలో జరుగు జిల్లా స్థాయి ఎంపికలక 5వ తరగతి నందు ప్రవేశం కొరకు 31 ఆగస్టు 2023 నాటికి 9 నుండి 11 సంవత్సరంల వయస్సు కలిగిన ఆసక్తి గిరిజన విద్యార్థిని, విద్యార్థులు హాజరుకావాలని ఆయన అన్నారు. జిల్లాస్థాయి ఎంపికలలో బ్యాటరీ టెస్ట్ (9 అంశముల నందు) ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులు మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసాని నందు 18 మార్చ్ 2023 నుండి 21 మార్చ్ 2023 తేదీలలో తుది ఎంపికలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ఐదవ తరగతిలో ప్రవేశం కల్పించడం జరుగుతుందని అన్నారు.

కావున సంబంధిత వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఇట్టి విషయాన్ని గమనించి విద్యార్థిని, విద్యార్థులను జిల్లా స్థాయి ఎంపికలకు హాజరగునట్లు చూడవలసినదిగా ఆయన తెలిపారు. పూర్తి వివరాల కోసం ఆర్.రమాదేవి సంచాలకులు, గిరిజన సంక్షేమ శాఖ భద్రాచలం, శ్రీ కృష్ణ నాయక్ ఉపసంచాలకులు, గిరిజన సంక్షేమ శాఖ ఖమ్మం, డాక్టర్ ఎం.వీరా నాయక్, స్పోర్ట్స్ ఆఫీసర్ గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ భద్రాచలం, ఫోన్ నెంబర్లు 8978477345, 9440154345 సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆయన కోరారు.

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా 10వ మహాసభలకు హాజరైన జిల్లా నాయకులు

నవతెలంగాణ-కొత్తగూడెం

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హౌరాలో జరుగుతున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా 10వ మహాసభలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నాయకులు హాజరయ్యారు. హౌరాలోని కామ్రేడ్ జ్యోతిబసు నగర్‌లో ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు ఈ మహాసభలు జరుగుతున్నాయి. ఈ మహాసభలకు ప్రతినిధులుగా జిల్లా నుంచి అన్నవరపు కనకయ్య, మచ్చ వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాస్, బి.చిరంజీవి, శెట్టి వినోద, ముదిగొండ రాంబాబులు హాజరయ్యారు. ఈ మహాసభలలో తెలంగాణ రాష్ట్ర కార్యక్రమాల రిపోర్ట్‌ను నాయకులు ప్రజెంట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో, తెలంగాణ రాష్ట్రంలో వర్గ పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం దళితులు, గిరిజనుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు సాగు భూమి, ఇంటి స్థలం, ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, ప్రభుత్వ రంగ సంస్థల, వ్యవసాయ రంగంలో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాటాలు నిర్వహిస్తామన్నారు. పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇచ్చే వరుకు పోరాడుతామన్నారు. అఖిల భారత మహసభల స్పూర్తితో ఉద్యమి స్తామని స్పష్టం చేశారు.



విజయవంతంగా జాబ్ మేళా

నవతెలంగాణ-భద్రాచలం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగులైన గిరిజన యువతీ, యువకులకు ప్రయివేట్ సంస్థలలో ఉద్యోగాలు చేసుకొని జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఐటీడీఏ భవిత సెల్ ద్వారా జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని జేడీఎం హరికృష్ణ అన్నారు. గురువారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి గౌతమ్ పోట్రు ఆదేశాను సారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో నిర్వహించిన వివిధ ప్రయివేట్ కంపెనీలలో నెలకు రూ.10 వేల నుండి 20 వేల వరకు వేతనంతో కూడిన వివిధ ఉద్యోగాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూకు 150 మంది యువతీ, యువకులు హాజరయ్యారు. కాగా దాంట్లో 84 మంది వివిధ ప్రయివేట్ రంగంలో జీవనోపాధి పొందటానికి ఉద్యోగాలకు అర్హత సాధించారని ఆయన అన్నారు. మొత్తం7 ప్రయివేట్ కంపెనీలు భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ నుండి వచ్చిన కంపెనీల యజమానుల సమక్షంలో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. సన్ షైన్ హెల్త్ కేర్ ఇన్స్టిట్యూట్ కంపెనీలో కేర్ టేకర్, నర్స్ పోస్టులకు ఆరుగురు, వరుణ్ మోటార్ కంపెనీలో సేల్స్ మెన్, అండ్ సర్వీస్ అడ్వైజర్, టెక్నీషియన్ పోస్టులకు పదిమంది, భారత్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో లోన్ ఆఫైర్స్ పోస్టులకు 17 మంది, రిలయన్స్ లైఫ్ టెలికాలర్ లిమిటెడ్ కంపెనీలో కస్టమర్ గైడ్స్ పోస్టులకు 22 మంది, నవత రోడ్ ట్రాన్స్పోర్ట్ కంపెనీలో డ్రైవర్, క్లర్క్ పోస్టులకు 9 మంది, ఓపీడీఎస్ కంపెనీకి సెక్యూరిటీ గార్డ్ పోస్టులకు 15 మంది, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ కంపెనీకి క్లర్క్ పోస్టులకు ఐదుగురు ఎంపికైనట్లు ఆయన అన్నారు. ఈ జాబ్ మేళాలో ఎంపికైన 84 మందికి ఆయా పోస్టులలో జాయిన్ అవ్వడానికి త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ భవిత సెల్ సహాయకులు స్వరూప, సమ్మయ్య, పాపారావు, ఏడు కంపెనీల యజమానులు పవన్, గోపి, మనోజ్, అనిల్, సుబ్రహ్మణ్యం, శ్రీరామ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని మించిన మహాభాగ్యం మరొకటి లేదు

డిప్యూటీ మేనేజర్ భూక్య భాంగ్య

నవతెలంగాణ-మణుగూరు

ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యానికి మించిన మహాభాగ్యం మరొకటి లేదని పీకే ఓసి డిప్యూటీ మేనేజర్ భూక్య భాంగ్య అన్నారు. గురువారం ఓసి 2 రిలే-బిలో ఆపరేటర్‌గా పనిచేస్తూ చాతి నొప్పితో హైదరాబాద్ ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో రెండు రోజుల క్రితం ఆకస్మికంగా మృతి చెందిన దాసరి భూషణం సంతాప సభను ఓసీ 2 ఆవరణంలో నిర్వహించారు. ఈ సంతాప సభకు ముఖ్య అతిథిగా డిప్యూటీ మేనేజర్ సి రిలే ఇన్ చార్జ్ భూక్య భాంగ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భూషణం సంస్థకు చేసినసేవలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా భూషణం కుటుంబానికి ఓసి 2 ఉద్యోగుల తరపున ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆయన మృతికి సంతాప సూచకంగా ఉద్యోగులందరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నాసర్ పాషా, అధికారులు నాగేంద్ర, బాబ్జి, కృష్ణమూర్తి, గుర్తింపు సంఘం నాయకులు ఇందురి శంకర్, సూపర్వైజర్లు కోలా వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుకుమార్, అశోక్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



అనుదినం..జనస్వరం

www.praja.khammam@gmail.com

నవతెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం 17 ఫిబ్రవరి 2023

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

- ఎమ్మెల్యేకు జర్నలిస్టులు వినతి



నవతెలంగాణ-జూలూరుపాడు

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని వైరా శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్‌కు జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ ఆర్.శారదతో జూలూరుపాడు వర్కింగ్ జర్నలిస్టులు గురువారం సమావేశం అయ్యారు. సమావేశ కార్యక్రమాన్ని ఉద్దేశించి జర్నలిస్టు మిత్రులు మోదుగు ప్రభాకర్ మాట్లాడుతూ... మండల కేంద్రంలో జర్నలిస్టు వృత్తిలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మారుమూల ప్రాంతాలలో వార్తలు సేకరించి వాటిని పరిష్కార దిశగా ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టు సేవలను గుర్తించి ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందించారని, అందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదికగా బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ మొట్టమొదటి సభలో ముఖ్యమంత్రి ప్రకటన చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన అనంతరం రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాలలో వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, తహసీల్దార్ ఆర్.శారదలకు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా జర్నలిస్టులకు ఇంటి స్థలాన్ని మంజూరు చేయడానికి అనువైన స్థలాన్ని పరిశీలించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్టులు విజయ భాస్కర్, ఖాసిం, శివమూర్తి, మురళి, సత్యనారాయణ, పూర్ణచంద్రరావు, కృష్ణ ప్రసాద్, సిద్దిఖ్, వెంకటేశ్వర్లు, షఫీ, ప్రవీణ్, ఆదాం, జానీ, దుర్గారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం దేవస్థానం ఈఓగా అవకాశం నా అదృష్టం

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసిన ఈఓ



నవతెలంగాణ-పాల్వంచ

భద్రాచలం దేవస్థానం ఈఓగా విధులు నిర్వహించే అవకాశం రావడం ఎంతో అదృష్టమని దేవుని సేవ చేసే భాగ్యం కలాగడం చాలా సంతోషమని జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. గురువారం ఈఓగా పదవీ బాధ్యతలు చేపట్టిన రమాదేవి పాల్వంచలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. అనుభవం కలిగిన అధికారి ఈఓగా రావడం శుభపరిణామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహెూత్సవాలున్నాయని వైభవంగా నిర్వహించుటకు చర్యలు చేపట్టాలని చెప్పారు. చేపట్టాల్సిన పనుల టెండరు ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని ఎలాంటి లోటుపాట్లు రాకుండా పకడ్బంది ఏర్పాట్లు చేయాలని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సేవలు అందించి స్వామి వారి ఆశీర్వచనాలు, ప్రజల మన్ననలు పొందాలని ఆయన సూచించారు. అనంతరం స్వామి వారి ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు పొడిచేటి పాండురంగాచార్యులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 159 OF 2016

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 15-169, 1st Floor, NVR Complex, Near Bus Stand, Sathupally, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman,
.........DISPUTANT

VERSUS

Amudala Ramesh & 3 Others
To
Opponent No.1. Amudala Ramesh, S/o. Jagannadham, Age: 31 years, Occ: Sri Sai Ganesh Auto Consultency, Opp: Siddaram Road, Sathupally, R/o. Kallurugedem, Vemsoor Mandal, Khammam District.
Opponent No.2. Gudala Shankaraiah, S/o.Ramulu, Age: 47 years, Occ:SCCL,JVR OC-I, Sathupally, Category-III, Pump Operator, R/o. H.No. 16-1-81, Vani Vidyalayam Road, Sathupally Mandal, Khammam District.
Opponent No.3. Gummadi Shiva Shankar, S/o. Apparao, Age: 34 years, Occ: Police Department, APSP 15th Battalion, B-Gangaram, PC-1192, R/o. Sai Apartment Road, Kakatlapally Road, Sathupally Mandal, Khammam District.
......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 78,657=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to 28-02-2023 for your appearance.
Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:00 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits,
Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 165 OF 2016

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 13-3-212/6, Cherla Road, Bhadrachalam, Town, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman,
.........DISPUTANT

VERSUS

Guggala Sunitha & 4 others
To
Opponent No.3. Kalluri Pushpavathi, D/o. Rajulu, W/o. Muthamsety Venkateswarlu, Age: 40 years, Occ: MPHA(F), MPHC, Manuguru, R/o. Kothapalli(V), Cherupalli(P), Dummugudem Mandal, Khammam District.
......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs.43,110=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to 28-02-2023 for your appearance.
Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:00 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits,
Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 244 OF 2015

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 8-2-216, Kothagudem Town, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman,
.........DISPUTANT

VERSUS

Venna Prasad, & 4 Others
To
Opponent No.1. Venna Prasad, S/o. V.Somaiah, Age: 30 Yrs., Occ: Helper, Khalasi, S&T Tele, Bhongiri,R/o. Q.No. 120/1, Writer Basthi, Kothagudem Post, Khammam Dist.
Opponent No.2. Mahapatra Saroj Kumar, S/o. Bhikani Charan, Age: 36 Yrs., Occ: Helper, Khalasi, S&T Tele, BDCR,, R/o. H.No.121/7, Writer Basthi, Kothagudem, Khammam Dist.
Opponent No.3. Kota Sangamaiah, S/o. Butchaiah, Age: 55 Yrs., Occ: SRT Rolly Man, S&T Tele, BDCR, R/o. H.No. 7-3-124, Medar Basthi, Kothagudem, Khammam Dist.,
Opponent No.4. Katari Ramesh Kumar, S/o. K.Veera Swamy, Age: 52 Yrs., Occ: Sr.Tech, S&T, Tele, BDCR, R/o. H.No. 2-1-279, SC/BC Colony, Dornakal, Warangal District.
Opponent No.5. Marapaka Mukesh, S/o. M.Mallaiah, Age: 26 Yrs., Occ: Khalasi, Helper,
S&T, Tele, BDCR, R/o. H.No.120/2, Writer Basthi, Kothagudem, Khammam District.
......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 38,152=00- against you and others and where as the above Arbitration/ Dispute is posted to 28-02-2023 for your appearance.
Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:00 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits,
Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 269 OF 2017

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 8-2-216, Kothagudem Town, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman,
.........DISPUTANT

VERSUS

Modiam Krishna & 3 others
To
Opponent No.2. Vasam Saidulu, S/o. Ramaiah, Age: 52 years, Occ: Sales Man, G.P.C.M.S. Ltd., Kukkunoor, R/o. Velairpadu Mandal, Khammam District.
Opponent No.3. Valla Gopala Krishna Reddy, S/o. Venkata Reddy, Age: 52years, Occ: M.C.W, G.P.C.M.S. Ltd., Kukkunoor R/o. Zeediguppa, V. R. Puram Mandal, East Godavari District.
......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 70,063=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to 28-02-2023 for your appearance.
Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:00 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits,
Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 304 OF 2021

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 2-1-101, 1st Floor, Masjid Center, Ashok Nagar, Main Road, Manuguru, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman,
......DISPUTANT

VERSUS

Katukuri Lingamurthy & 3 Others
To
Opponent No.1. Katukuri Lingamurthy, S/o.Rajaiah, Age: 45 years, Occ: General Mazdoor, SCCL, Manuguru, Emp No. 4055552, R/o.Q.No: D-138, Kunavaram Colony, P.V Town Ship, Manuguru Town & Mandal, Bhadradri Kothagudem District. 507117
Opponent No.3. Tanguturi Sadanandam, S/o.Dharmaiah, Age: 50 years, Occ: General Mazdoor, SCCL, Manuguru, Emp No. 04048806, R/o. Q.No.D-912, Mallaram, P.V Colony, Manuguru Town & Mandal, Bhadradri Kothagudem District. 507117
Opponent No.4. Thaduri Manohar, S/o.Mallaiah, Age: 35 years, Occ. Security Guard, SCCL, Manuguru, Emp No. 02372916, R/o. H.No. 2-1-131, Pilet Colony, Manuguru Town & Mandal, Bhadradri Kothagudem District.50117
......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 41,147=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to 28-02-2023 for your appearance.
Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:00 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits,
Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 29 OF 2017

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 4-1-8/A, Beside Pattabhiramayya Hospital, Ramnagar, Chunchupally, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman,
.........DISPUTANT

VERSUS

Sabbathi Sumithra Devi & 4 Others
To
Opponent No.2. Andlapuri Kalavathi, S/o. Kistaiah, Age: 56 years, Occ: SGT ASST, RBN School, Kothagudem, R/o. Flat No.512, Thatipalli Apartments, Kothagudem Mandal, Khammam District.
Opponent No.5. Manchala Veera Swamy, S/o. Nagaiah, Age: 61 years, R/o. ZP Quarters Q.No.5, Ram Nagar, Chuchupalli, Kothagudem Mandal, Khammam District.
......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 42,734=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to 28-02-2023 for your appearance.
Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:00 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits,
Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 128 OF 2018

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 13-3-212/6, Cherla Road, Bhadrachalam, Town, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman,
.........DISPUTANT

VERSUS

Mr. Shaik Abdul Hameed, & 1 others
To
Opponent No.2. Bommaraju Venkateswarlu, S/o. Bikshamaiah, Age: 43 years, Occ:Rigger Worker in Damodar Ropeways & Construction Company Pvt.Ltd., Manuguru,
R/o. Mittaigudem(V), Aswapuram Mandal, Bhadradri Kothguem District.
......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 12,018=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to 28-02-2023 for your appearance.
Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:00 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits,
Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 353 OF 2021

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 2-1-101, 1st Floor, Masjid Center, Ashok Nagar, Main Road, Manuguru, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman,
......DISPUTANT

VERSUS

Shaik Johni Pasha & 5 Others
To
Opponent No.4. Sunkari Rajender, S/o. Sammaiah, Age: 33 years, Occ: Operating, BDCR SCR Manuguru, R/o. Q.No. 9/2, Railway Quarters, Manuguru Mandal, Bhadradri Kothagudem District.
......OPPONENTS

